

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 20 ఆగస్టు 2025

మండలంలో ప్రభుత్వ భూములు రెవెన్యూ అధికారులకు కాసుల పంట పండిస్తున్నాయి. వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉండగా అంతే స్థాయిలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయి. రెవెన్యూ అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో ప్రభుత్వ భూములు కబ్జా చేసి కోట్ల రూపాయలకు అమ్ముకుంటున్నారు. గత ప్రభుత్వంలో ఇష్టానుసారంగా తహసీల్దారులు ప్రభుత్వ భూములను ఆన్‌లైన్ చేశారు. కూటమి ప్రభుత్వంలో కూడా ఆక్రమించిన ప్రభుత్వ భూములను పక్కాగా రికార్డుల్లో పొందుపరచి కబ్జాదారులకు అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



రాజంపేట సబ్ కలెక్టర్‌కు ఇచ్చిన నివేదికలో సర్వే నెంబరు-846 ప్రభుత్వ భూమి అని చూపిన గత తహసీల్దారు

ఒంటిమిట్ట విజయం అభినందనీయం...

- పార్టీ రాష్ట్ర నాయకుల అభినందనలు
- రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన చమర్తి, జడ్పీటీసీ ముద్దుకృష్ణారెడ్డి



పల్లా శ్రీనివాసరావుకు స్వీటు తినిపిస్తున్న జడ్పీటీసీ ముద్దుకృష్ణారెడ్డి, చిత్రంలో చమర్తి

ఒంటిమిట్ట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకోవడం అభినందనీయమని తెలుగుదేశం పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులను జడ్పీటీసీగా ఎన్నికైన ముద్దుకృష్ణారెడ్డి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు కలిశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో పాటు పాటు పలువురు పార్టీ సీనియర్ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా వారు జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి విజయం సాధించేందుకు కృషి చేసిన జగన్‌మోహన్‌రాజును అభినందించారు. కొన్ని సంవత్సరాలుగా వైసీపీకి కంచుకోటగా ఉన్న ఒంటిమిట్ట మండలంలో టీడీపీ విజయం సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాజంపేట మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ సురేష్‌రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, కాంట్రాక్టర్ ఎస్‌వీ రమణ, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, ఎంపీటీసీ బాషా, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.


హంద్రీ-నీవాతో సస్యశ్యామలం

- నియోజకవర్గంలో అన్ని చెరువులకు నీరు



హంద్రీ-నీవా కాలువ వద్ద పూజలు చేస్తున్న జయచంద్రారెడ్డి

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువకు కృష్ణా జలాల రాకతో తంబళ్లపల్లె నియోజకవర్గం సస్యశ్యామలమవుతుందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డి.జయచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన అధికారులు, కూటమి నాయకులు, రైతులతో కలిసి పీటీఎం సమీపంలోని హంద్రీ-నీవా ఎత్తిపోతల పంప్ హౌస్ వద్ద పంప్‌లను ఆన్ చేసి నీటిని ఉమ్మడి చిత్తూరు జిల్లాలోకి విడుదల చేశారు. అనంతరం కృష్ణమ్మకు వేదపండితుల ఆశీర్వచనంతో జలహారతి ఇచ్చి చీర సారెను సమర్పించారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు హంద్రీ-నీవా జలాలను కుప్పం వరకు పారిస్తానని మాట ఇచ్చి నేడు చంద్రబాబు దానిని నిలుపుకున్నారన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన చెరువులన్నింటికి హంద్రీ-నీవా జలాలను నింపుతామన్నారు. కార్యక్రమంలో హంద్రీ-నీవా అధికారులతో పాటు సింగిల్ విండో మాజీ చైర్మన్ సంపతికోట కిట్టన్న, టీడీపీ సీనియర్ నాయకులు కట్టా సురేంద్ర నాయుడు, జనసేన తంబళ్లపల్లె ఇంచార్జ్ పోతుల సాయినాథ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ బందార్ల పెద్ద వెంకట్రమణ, తదితరులు పాల్గొన్నారు.



కొమ్మనవారిపల్లెలో ఆక్రమణకు గురైన 846 సర్వే నెంబరులోని ప్రభుత్వ భూమి



కబ్జాలకు అండగా...

- వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా.. నేడూ అంతే...
- ప్రభుత్వ భూములను కబ్జాదారులకు పక్కా చేస్తున్న అధికారులు
- ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు
- కబ్జాదారుల కబంధహస్తాల్లో ప్రభుత్వ భూములు


పుల్లంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మనవారిపల్లె రెవెన్యూ విలేజ్‌లో ప్రభుత్వ భూములు ఎక్కువగా కబ్జాకు గురయ్యాయి. గత ప్రభుత్వంలో ఇష్టానుసారంగా కబ్జా చేసేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా ప్రభుత్వ భూముల కబ్జా కొనసాగుతూనే ఉంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో కొమ్మనవారిపల్లె రెవెన్యూ విలేజ్‌లో అధికార పార్టీకి చెందిన ఓ చోటా నాయకుడు ప్రభుత్వ భూమిపై కన్నేశాడు. సర్వే నెంబరు-846లో 4.34 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి చుట్టూ కంచె వేశాడు. ఆ తర్వాత మొక్కలు నాటి డ్రిప్ ఏర్పాటు చేసుకున్నాడు. అంతకుముందు ఇదేవిధంగా ఆక్రమించి ఉంటే తొలగించారు. రెవెన్యూ అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో ప్రతిరోజూ తహసీల్దారు కార్యాలయానికి వచ్చి మంతనాలు చేస్తూ తన పక్కన ఉన్న ప్రభుత్వ భూములు కూడా కబ్జా చేయించి అధికారులకు చేతులు తడిపినట్టు ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇదే పంచాయతీకి చెందిన ఓ మహిళ సర్వే నెంబరు-846 ప్రభుత్వ భూమి అని ఆక్రమణలను తొలగించాలని రాజంపేట సబ్‌కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. గత తహసీల్దారు అరవిందకిషోర్ సర్వే నెంబరు-846 ప్రభుత్వ భూమి అని చుట్టూ కంచె వేశారని రాజంపేట సబ్‌కలెక్టర్‌కు నివేదిక పంపారు. అయితే ఈ నివేదికలో కంచెను తొలగించకుండానే తొలగించామని చూపారు. ఇదే నెంబరులో ఆక్రమణలు తొలగించాలని పీజీఆర్ఎస్‌లో పుల్లంపేట తహసీల్దారుకు తిరిగి ఫిర్యాదు చేయడంతో ఇది ప్రభుత్వ భూమి అని డీకేటీ రిజిస్టర్‌లో అయితే ప్రస్తుత తహసీల్దారు పుల్లారెడ్డికి ఇదేవిధంగా సర్వే నెంబరు-846లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించాలని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. తహసీల్దారు విచారణ చేపట్టి ఈ సర్వే నెంబరుకు సంబంధించి సాగులో ఉన్న వారు సరైన ఆధారాలు చూపాలని డీకేటీ రిజిస్టర్ కాపీ, మాన్యువల్ అడంగల్ కాపీ, అలాగే మాన్యువల్ పాస్ పుస్తకం సమర్పించాలన్నారు.

అంతేగాకుండా డీకేటీ రిజిస్టర్‌లో కూడా పేరు నమోదై ఉందని పరిశీలించామని పరిష్కారపత్రాన్ని ఫిర్యాదు చేసిన వారికి అందజేశారు. రెండు నెలల్లో ఎటువంటి అసైన్‌మెంట్ కమిటీ లేకుండా ప్రభుత్వ భూమి ఎలా డీకేటీ పట్టా అయ్యిందో డీకేటీ రిజిస్టర్‌లోకి ఎలా చేరిందో ఆ తహసీల్దార్‌కే తెలియాలి. గతంలో రాజంపేట సబ్‌కలెక్టర్‌కు నివేదిక ఇచ్చిన తహసీల్దారు సర్వే నెంబరు-846 ప్రభుత్వ భూమి అని పక్కాగా చూపుతూ ఇది ప్రభుత్వ భూమి అని ఎవరికీ మంజూరు చేయలేదని నివేదిక పంపితే మరి ప్రస్తుత తహసీల్దారుకు ఆ ప్రభుత్వ భూమి ఎలా డీకేటీ పట్టా అయ్యిందో ఆయనకే తెలియాలి. ఒక ఐఏఎస్ అధికారి ప్రభుత్వ భూమి ఆక్రమణపై నివేదిక ఇవ్వాలని తహసీల్దారును కోరితే ఆక్రమణలు తొలగించకుండానే తొలగించామని నివేదిక ఇవ్వడం బట్టి చూస్తే రెవెన్యూ అధికారులు కబ్జా

ఎవరి పేరుతోనూ లేవని నోటీసులు జారీ చేస్తావని చెప్పారు.

దారులకు ఎలా సహకరిస్తున్నారో తెలుస్తుంది. గత ప్రభుత్వంలో అయితే పుల్లంపేట మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారికి తహసీల్దారు ఆన్‌లైన్ చేసి కట్టబెట్టారు. ప్రస్తుత ప్రభుత్వంలో తహసీల్దారులు కబ్జాచేసిన భూములను కబ్జాదారులకు క్రమబద్ధీకరిస్తున్నారంటే ప్రభుత్వ భూములు కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు ఎలా అండగా నిలుస్తున్నారో తెలుస్తోంది. మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో సుమారు 70 నుంచి 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది అంటే రెవెన్యూ అధికారుల పనితీరు ఎలా ఉందో తెలుసుకోవచ్చు. ఎటువంటి ఆధారాలు లేకుండానే భూములను కబ్జాదారులకు కట్టబెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతస్థాయి అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపితే రికార్డులు లేకుండానే ప్రభుత్వ భూమి ఎలా ఆన్‌లైన్ అయ్యాయి. తప్పుడు నివేదికలు ఉన్నతాధికారులకు ఇక్కడ నుంచి ఎలా వెళుతున్నాయి. ఎందుకు వెళుతున్నాయనే విషయాలు బట్టబయలవుతున్నాయి.

సర్వే నెంబరు-846పై పుల్లంపేట తహసీల్దారు పుల్లారెడ్డిని వివరణ కోరగా ఇది ప్రభుత్వ భూమి కాదని, డీకేటీ పట్టా చేసుకుని ఉన్నారన్నారు. గత తహసీల్దారు ఇది ప్రభుత్వ భూమి అని నివేదిక ఇచ్చారని చెప్పగా మరోసారి డీకేటీ రిజిష్టర్ పరిశీలిస్తామని తెలిపారు.



ప్రభుత్వ భూమి కాదని డీకేటీ పట్టా ఇచ్చారని ప్రస్తుత తహసీల్దారు ఇచ్చిన నివేదిక

హంద్రీ-నీవా కాలువ పూడ్చివేత

- రాకపోకలకు వంతెన నిర్మించండి
- కృష్ణా జలాల తరలింపు నేపథ్యంలో నిరసన
- అతికష్టంపై మట్టిని తొలగించిన అధికారులు



జనుపువారిపల్లి రైతులతో ఈఈ నీలకంఠారెడ్డి

బి.కొత్తకోట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా సిమెంట్ లైనింగ్ పనులతో తాము రాకపోకలు సాగించలేమని, వంతెన నిర్మించే వరకు నీరు వెళ్లనీయమంటూ జనుపువారిపల్లి గ్రామస్థులు కాలువలో మట్టి పోసి కాలువ నిరసన తెలియచేశారు. వివరాలిలా ఉన్నాయి. హంద్రీ-నీవా కాలువ నిర్మాణంలో చాలా గ్రామాల ప్రజలకు కాలువ దాటే క్రయంలో ఇబ్బందులున్నాయి. వ్యవసాయ భూములకు, పక్క గ్రామాలకు వెళ్లేందుకు కాలువ అడ్డు అవుతోంది. ఇంతకు మునుపు రైతులంతా కలిసి తాత్కాలిక వంతెనలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం కాలువకు లైనింగ్ పనులతో కాలువ వెడల్పు పెరిగిపోవడంలో తాత్కాలిక వంతెనలకు వీలు లేకుండా పోయింది. ఇదేవిధంగా జనుపువారిపల్లె వద్ద హంద్రీ-నీవా కాలువ వ్యవసాయ పొలాలతో గ్రామాన్ని వేరు చేస్తోంది. ఈ విషయమై గ్రామస్థులు పలుమార్లు ధర్నాలు చేసి, సమస్యపై అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో మంగళవారం కాలువను మట్టితో పూడ్చి గ్రామస్థులు రాకపోకలు సాగించారు. తాజాగా కుప్పంకు కృష్ణాజలాలు తరలించే ప్రక్రియ ప్రారంభం కావడంతో మంగళవారం అధికారులు ఎక్స్‌కవేటర్‌తో అక్కడికి వెళ్లారు. విషయం తెలియడంతో గ్రామస్థులు అక్కడికి చేరుకొని మట్టి తీయరాదని ఎక్స్‌కవేటర్ చక్రాలపై పడుకుని నిరసన తెలిపారు. కాలువకు నీరు వస్తే తమ పంట పొలాలకు, చౌడేశ్వరి మాత గుడికి వెళ్లడానికి వీలు కాదని, ప్రత్యామ్నాయం చూపేవరకు ఆందోళన విరమించమని తెలిపారు. కాలువను క్లియర్ చేసేందుకు హంద్రీ-నీవా ఈఈ నీలకంఠారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కుప్పంకు నీటిని తరలించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలని అడ్డుకోవడం సరికాదని నచ్చజెప్పారు. రాత్రికిరాత్రి బ్రిడ్జి కట్టాలంటే కుదరదని, కాలువ పొడవునా బ్రిడ్జిలు నిర్మించాల్సిన ప్రదేశాలను గుర్తించి ప్రతిపాదనలు పంపామని, అనుమతులు వచ్చి నిధులు మంజూరు అవగానే కడతామని వివరించారు. దీంతో గ్రామస్థులు వెనక్కు తగ్గడంతో కాలువలో మట్టిని తీసివేశారు.



మట్టి తీయరాదంటూ ఎక్స్‌కవేటర్ చక్రంపై పడుకున్న వ్యక్తి

రూ.12.26 కోట్ల బకాయిలు విడుదల

- 19,458 మందికి సొమ్ము చెల్లింపు
- డ్వామా పీడీ వెంకటరత్నం



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరత్నం

ములకలచెరువు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2014 నుంచి 2019 సంవత్సరం వరకు చేపట్టిన పనులకు సంబంధించి జిల్లాకు కేంద్ర ప్రభుత్వం రూ.12.26 కోట్లు విడుదల చేసిందని డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. స్థానిక సీఎల్ఆర్‌సీ భవనంలో మంగళవారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అధ్యక్షతన తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళపల్లె, కురబలకోట, పెద్దమండ్యం, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల లబ్ధిదారులు, రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2014 నుంచి 2019 వరకు ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు, బీటీ రోడ్ల పనులు, ఉద్యానవన పంటల సాగు, గోకులం షెడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు, రైతుటుకు 22 శాతం నగదు ఉంచుకుని బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు. మిగిలిన 22 శాతం డబ్బులు రాక లబ్ధిదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంతో జిల్లాలోని 19,458 మందికి రైతులకు రూ.12.26 కోట్లు కేంద్రం విడుదల చేసిందన్నారు. త్వరలోనే ఈ నగదు లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ అవుతుందన్నారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని 342 మందికి రూ.1.67 కోట్లు విడుదలైందని, కూటమి ప్రభుత్వ చొరవతో పెండింగ్ బకాయిలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. సమావేశంలో డ్వామా ఏపీడీ నందకుమార్ రెడ్డి, పీఆర్ డీఈ విజయమోహన్, టీడీపీ నేతలు గుత్తికొండ త్యాగరాజు, ఎర్రగుడి సురేష్, కేవీ రమణ, భజంత్రి రామాంజులు, మూగి రవి చంద్ర, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై కీలక పాత్ర పోషించాలి : కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ భావన

రాజంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికల్లో వచ్చే వినతులు, భూముల రీసర్వే, భూవివాదాలు, రికార్డులు వంటి రెవెన్యూ సమస్యలపై రెవెన్యూ అధికారులు కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. మంగళవారం రాజంపేట పట్టణంలోని కళాంజలి కల్యాణ మండపంలో రెవెన్యూ అధికారులకు ప్రజా సమస్యలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన వినతులు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూవివాదాల దరఖాస్తులు, భూముల రీసర్వే తదితర అంశాల్లో రెవెన్యూ సిబ్బంది కీలకపాత్ర పోషించాలన్నారు. ప్రతి అధికారి నిజాయితీతో పనిచేసినప్పుడే రెవెన్యూ శాఖకు మంచి గుర్తింపు వస్తుందన్నారు. ప్రజలను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం, నిర్లక్ష్య సమాధానాలు చెప్పకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తే జిల్లాకు, ప్రభుత్వానికి మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. అంతకు ముందు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులకు సమగ్ర శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ భావన, డీఆర్వో, కలెక్టర్ సూపరింటెండెంట్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




ఊటీని తలపిస్తున్న వెలుగొండ అడవి

మనసును హత్తుకునేలా...


- వెలుగొండ అందాలు చూడతరమా...

గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో వెలుగొండ అడవి అందాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. ఈ అడవికి దగ్గరగా ఉన్న గొట్టిమానుకోన మినీ రిజర్వాయర్ నీటితో కళకళలాడుతోంది. చిట్వేలి-రాపూరు రోడ్డు ఊటిని తలపించేలా ఆకట్టుకుంటోంది. మేఘాలు కొండలను తాకినట్లుగా కనిపిస్తున్నాయి. నాలుగు నెలలుగా కాసిన ఎండలకు అడవి రూపురేఖలు మారిపోయింది. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు అడవిలో పచ్చదనం పరుచుకుంది. రాపూరు ఘాట్ రోడ్డులో ప్రయాణించేవారు అడవి అందాలను చూసి మైమరచిపోతున్నారు.

-రైల్వేకోడూరు (ఆంధ్రజ్యోతి)



చిట్వేలి-రాపూరు రోడ్డులో పచ్చదనం



గొట్టిమానుకోనలో జలకళ



వెలుగొండ అడవి చెట్ల పొదల్లోంచి అస్తమిస్తున్న సూర్యుడు

నిరుద్యోగులకు వరం..పీఎంఈజీపీ

- 343 యూనిట్లకు... 253 యూనిట్లు పూర్తి
- డెయిరీ ఫాం, పవర్‌లూమ్స్, వర్క్‌షాప్‌లకు అధిక ప్రాధాన్యత
- జిల్లాలో డెయిరీ ఫామ్‌పై 60-70 శాతం యువత మొగ్గు

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ) ప్రవేశ పెట్టింది. ప్రస్తుతం ఈ పథకం నిరుద్యో గులకు వరంలా మారింది. రాయల సీమలో అన్నమయ్య జిల్లా కరువు ప్రాంతానికి పెట్టింది పేరు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే తప్ప నిరుద్యోగ యువత వలసలకు అడ్డుకట్ట వేయలేమనే వాదన ఒకప్పుడు బలంగా ఉండేది. అయితే ఇక్కడ చదువుకుని ఉద్యోగాలు లేక నిరుద్యోగులు కువైత్, సౌదీ ప్రాంతాలకు వెళ్లి నానా ఇబ్బందులు పడుతూ.. ఇక్కడ కుటుంబాలను పోషిస్తున్న పరిస్థితి గత 30 ఏళ్లుగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో మదనపల్లె డివిజన్‌లోని యువత ఎక్కువగా పాడి పరిశ్రమ, పవర్‌లూమ్స్, వర్క్‌షాప్‌పై మొగ్గుచూపుతున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా 343 యూనిట్లకు గానూ 252 యూనిట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం దాదాపు రూ.884 లక్షలు బ్యాంకుల ద్వారా నిరుద్యోగ యువతీ, యువకులకు అందించినట్లు అధికారుల



జిల్లా పరిశ్రమలశాఖ కార్యాలయం

లెక్కలు చెబుతున్నాయి. రాజంపేట, రాయచోటి డివిజన్‌లో టైలరింగ్, జిరాక్స్, బ్యూటీపార్లర్, వర్క్‌షాపుల పైన యువతీ యువకులు ఎక్కువ మొగ్గుచూపుతున్నారని తెలుస్తుంది.

ఈ నేపథ్యంలో పీఎంఈజీపీ ద్వారా నిరుద్యోగ యువతకు 2025-26 ఏడాదికి మొత్తం 135 యూనిట్లకు గాను రూ.324 లక్షలు ఇవ్వడానికి అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రాంతంలో చదువుకున్న యువతీ యువకులు సాఫ్ట్‌వేర్ వైపు మొగ్గు చూపి కొంత మంది ముంబై, చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో కొంతకాలం పనిచేసి తిరిగి వారి ప్రాంతాలకు వచ్చి వ్యవసాయం, పాడిపరిశ్రమ పైన ఎక్కువ శ్రద్ధ పెడుతున్నారని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో మదన పల్లె డివిజన్‌లో యువ సాఫ్ట్‌వేర్ తన ఉద్యోగం వదిలేసి పాడి పరిశ్రమలు ఏర్పాటు చేసి దాదాపు నెలకు రెండు లక్షలు సంపాదిస్తున్నాడని జిల్లా పరిశ్రమలశాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే రామాపురంలో ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన ఉద్యోగం వదిలేసి డ్రాగన్ ఫ్రూట్స్ వేసి రూ.20 లక్షలు సంపాదించాడని ఏడాది క్రితం పత్రికల్లో ఒక కథనం వచ్చింది. ఇలా నిరుద్యోగ యువతీ, యువకులను ఆదుకుంటూ వారికి చేదోడు వాదోడుగా జిల్లా పరి శ్రమలశాఖ ఉందని కొంత మంది నిరుద్యోగులే చెప్పుకొస్తున్నారు.

జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ఏమన్నారంటే..

ఈ విషయంపై జిల్లా పరిశ్రమలశాఖ అధికారి కృష్ణకిశోర్ ఆంధ్రజ్యోతితో మా ట్లాడుతూ.. జిల్లాలో యువతీ యువ కులు ఇతర దేశాలకు, ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని నిరుద్యో గులను ఆకర్షించే విధంగా కొన్ని కార్యక్రమాలు చేస్తున్నాం. అందులో భాగంగా మొదటగా పాలడెయిరీ ఫామ్‌లను యువత ఆకర్షిస్తున్నారు. తర్వాత పవర్‌లూమ్స్ కూడా లోన్స్‌తో పాటు చిన్న చిన్న కుటీర పరిశ్రమలకు సంబంధించిన లోన్స్ చేస్తున్నాం. కొందరు సాఫ్ట్‌వేర్ వైపు వెళ్లిన యువత తిరిగి వచ్చి వారి ప్రాంతంలో డైరీ ఫామ్ ఏర్పాటు చేసుకోవడం, వ్యవసాయం వైపు వెళ్లడం చేస్తున్నారు. వారికి తాము లోన్స్ ఇచ్చే ప్రయత్నాలు కూడా చేస్తున్నాం.

గుర్రంకొండలో చోరీ.. పీలేరులో ప్రత్యక్షం



పీలేరు టోల్‌గేట్ వద్ద నిందితులు వదిలి వెళ్లిన లారీ

గుర్రంకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులో మాయ మైన లారీ పీలేరు టోల్‌గేట్ వద్ద ప్రత్యక్షం కావడంతో లారీ యాజమానులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్ యార్డులో ఎన్నడూ లేని విధంగా లారీ చోరీకి గురవడం వ్యాపారులను విస్మయానికి గురిచేస్తోంది. వ్యాపారుల వివరాల మేరకు గుర్రంకొండ మార్కెట్ యార్డులో బాబాజాన్ టమోటా వ్యాపారాలను సాగిస్తున్నాడు. ఈ క్రమంలో టమోటాలను బయటి ప్రాంతాలకు తరలించడానికి సొంతంగా లారీలను ఏర్పాటు చేసుకున్నాడు. ఇటీవల మార్కెట్‌కు టమోటాలు తగ్గడంతో వ్యాపారాలు మందగించాయి. దీంతో రాత్రి పూట లారీలను మార్కెట్ యార్డులోనే ఉంచి ఇళ్లకు వెళతారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి మార్కెట్ యార్డులో ఉన్న 14 చక్రాల లారీని గుర్తుతెలియని నిందితుడు అపహరించి పీలేరు టోల్‌గేట్ వద్ద వదిలివెళ్లాడు. విషయం తెలుసుకున్న బాధితుడు లారీ చోరీకి గురైనట్లు గుర్తించి సీసీ కెమెరాలను పరిశీలించి పీలేరు టోల్ గేట్ వద్ద నిందితుడు వదిలివెళ్లినట్లు తెలుసుకుని లారీని గుర్రం కొండకు తీసుకొచ్చారు. లారీ చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వ్యాపారీ తెలిపాడు. పోలీసులు విచారించి నిందితుడిని పట్టుకుంటామని ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు.

విషద్రావణం సేవించి యువరైతు ఆత్మహత్య

- చెట్లవారిపల్లెలో విషాదం


వంశీకృష్ణారెడ్డి (ఫైల్)

ములకలచెరువు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... చౌడసముద్రం పంచాయతీ చెట్లవారిపల్లెకు చెందిన వెంకటస్వామిరెడ్డి కుమారుడు వంశీకృష్ణారెడ్డి(30) వ్యవసాయంలో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. తండ్రి అప్పులు చేయడంతో పాటు బీటెక్ చదువుకున్న తనకు ఉద్యోగం రాలేదని మనస్థాపం చెందాడు. ఈ క్రమంలో ఈ నెల 10న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబీకులు హుటాహుటిన చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయిస్తున్నారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. యువరైతు మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య


సుబ్రహ్మణ్యం

వాల్మీకిపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం చొక్కాండ్లపల్లె పంచాయతీ కనగాని గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం(45) తన భార్య కాపురానికి రాలేదని మనస్థాపం చెంది సోమవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మదనపల్లెలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలి

- ఆదర్శ పాఠశాలల ఏఏఎంవో పీవీఎస్ కుమార్


విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఏఎంవో పీవీఎస్ కుమార్

ములకలచెరువు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని ఆదర్శ పాఠశాలల అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పీవీఎస్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఆదర్శ పాఠశాల, కళాశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే కష్టపడి పనిచేయాలన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకోవాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి పని చేయాలన్నారు. అనంతరం టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఇన్‌టైమ్, అవుట్ టైమ్ హాజరు, విద్యార్థుల హాజరు, తరగతి గదులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై విద్యాశక్తి క్లాసుల పనితీరు, ఎంసెట్, జెఈఈ, నీట్ తరగతుల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని కూడా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కవిత పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవం


శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని గ్రామోత్సవం

పెనగలూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వడ్డిపాలెం వేంకటేశ్వరాలయం వార్షికోత్సవం సందర్భంగా మంగళ వారం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి తురక వెంకటరమణ, వెంకట సుబ్బమ్మ దంపతుల ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. అంతకంటే ముందు కుంచాల నరసింహులు, లక్షుమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీవారి మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలు, సువాసన పూలతో ఘనంగా అభిషేక కార్యక్రమం జరిగింది. తురక వెంకటయ్య, రమణమ్మ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. కుంచాల చిన్న వెంకటసుబ్బయ్య, యానాదమ్మల దంపతుల సహకారంతో గ్రామసభలో నెల్లూరు కళాకారులచే అద్భుతమైన కోలాట ప్రదర్శన జరిగింది. గ్రామసభలో భక్తులకు తురక కుమార్, వెంకటలక్షుమ్మ కుటుంబ సభ్యులు బూంది ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వహణ కార్యకర్తలు కుంచాల వేణు, బత్తల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

జైలు సిబ్బందిపై చర్యలు

- ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ సహా మరో ఇద్దరికి చార్జ్ మెమోలు

ప్రొద్దుటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు సబ్ జైలు నుంచి ఆగస్టు 16న రిమాండ్ ఖైదీ మహ్మద్‌రఫీ పరారీలో జైలు సిబ్బంది నిర్లక్ష్యంపై జిల్లా సబ్ జైళ్ల అధికారి అమర్‌బాషా చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు ఇన్‌చార్జ్ జైలు సూపరింటెండెంట్‌గా ఉన్న శ్రీనివాసరావుతో పాటు మరో ఇద్దరి కానిస్టేబుళ్లకు చార్జ్ మెమోలు జారీ చేశారు. రిమాండ్ ఖైదీ జైలు గోడలు దూకి పరారవ్వడంలో జైలులో వున్న భద్రత ప్రమాణాలపై కూడా చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా జైలు గోడలు ఎత్తుతో పాటు గోడలు ఎక్కేందుకు ఎక్కడెక్కడ వీలుందో పరిశీలించారు. అలాగే జైలు గోడలపై వేసిన ఇనుప కంచెలో మనుషులు దూరేంత సందు ఉండటం, తీగలకు విద్యుత్ ఉన్నా పరారవ్వడంపై లోతుగా ఆరాతీస్తున్నారు.

రిమాండ్‌కు తరలింపు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): చిప్పిలి వద్ద దాడి చేసి ఇద్దరిని గాయపర్చిన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు ఇటీవల సోషియల్ మీడియాల్లో పోస్టు పెట్టారనే కారణంతో పెద్దమండ్యం అవేకే నాయక్ తాండా సర్పంచ్ నటరాజ నాయక్, సాగర్లపై దాడి చేసి గాయపర్చారు. ఈ కేసులో శివశంకర్, కార్తీక్ రెడ్డి, హరీష్, శ్రీకాంత్‌రెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నూతన బార్ పాలసీపై అవగాహన అవసరం

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజ్

రాయచోటిటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నూతన బార్ పాలసీపై అవగాహన అవసరమని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ తెలిపారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన బార్ పాలసీలోని సానుకూలతలను వివరించారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని మదనపల్లెలో-5, రాజంపేటలో-2, రాయచోటిలో-3, పీలేరులో-1 చొప్పున బార్ల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల ఏర్పాటు కోసం ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు గడువు ముగిసిన అనంతరం ఈ నెల 28వ తేదీన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా బార్లు కేటాయిస్తారన్నారు. గతం కంటే ప్రస్తుతం లైసెన్స్ ఫీజు తగ్గడమే కాకుండా, బార్లు ఏర్పాటు చేసుకునే వారికి ప్రభుత్వం పలు సానుకూలతలు కల్పించిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మధుసూదన్, అసిస్టెంట్ అధికారి జోగేంద్ర, జిల్లాలోని ఎక్సైజ్ సీఐలు, లైసెన్స్‌దారులు, మద్యం షాపుల లైసెన్సీలు పాల్గొన్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరించుకుందాం

- ఏపీజీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డీ.లక్ష్మిప్రసాద్


సమస్యలపై చర్చిస్తున్న డాక్టర్ లక్ష్మిప్రసాద్

రాయచోటిటౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే 'టీ తాగుతూ చర్చించుకుందాం' అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మిప్రసాద్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమానికి హాజరైన వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సత్యనారాయణ నూతనంగా టీ తాగుతూ చర్చించుకుందాం అనే కార్యక్రమాన్ని ప్రారంభించార న్నారు. రాష్ట్రంలోని ఉద్యోగస్తులకు పీఆర్‌సీ అరియర్, డీఏ అరియర్, అలాగే 3 సంవత్సరాల సరెండర్ లీవ్స్ అరియర్స్ పెండింగ్ ఉన్నాయన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకతతో తాము ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతోనే సానుకూలంగా రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమం ద్వారా ఉద్యోగుల సమస్యలను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలాజీ, రాయచోటి తాలూకా అధ్యక్షుడు సాయికుమార్, కార్యదర్శి సుజిత్‌డాల్, పెన్షనర్ సంఘం అధ్యక్షుడు రాజా, సభ్యులు తిరుపతి శ్రీనివాసులు, అధ్యాపకులు మడితాటి నరసింహారెడ్డి, గిరిబాబుయాదవ్, మోహన్ నాయక్, శివభాస్కర్, రెడ్డెప్పరెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

పగలు బొగ్గులు.. రాత్రి దోపిడీలు

- పాణ్యం ముఠాకు రాయచోటి వ్యక్తి సాయం
- చెక్కవారిపల్లి నుంచి నెలకు సరిపడా సరుకులు

తనకల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలంలోని చెక్కవారిపల్లి అటవీ ప్రాంతంలో సోమవారం పట్టుబడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా వ్యవహారం కలకలం రేపుతోంది. అటవీ ప్రాంతంలో ఈ ముఠా ఆరు నెలలుగా గుడారాలు వేసుకుని ఉంటోంది. తనకల్లు, కదిరి రూరల్, పాణ్యం పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేసి వీరిని పట్టుకున్నారు. వారి కదలికలను గుర్తించేందుకు డ్రోన్‌ల నిఘా పెట్టారు. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన శేఖర్ అనే వ్యక్తి ద్వారా వీరు తనకల్లు మండలంలోని దిగువ చెక్కవారిపల్లికి చేరినట్లు సమాచారం. అక్కడి నుంచి నెల క్రితం అటవీప్రాంతానికి మకాం మర్చారు. వీరందరూ నంబులపూలకుంట మండలం పెడబల్లి వద్ద బొగ్గులు కాల్చే పనికి వెళ్లేవారు. వీరికి చెక్కవారిపల్లికి చెందిన ఓ వ్యక్తి ద్వారా ప్రతి నెలా తినడానికి కావలసిన సరుకులు వెళ్లేవని సమాచారం. రాయచోటికి చెందిన శేఖర్‌కు చెక్కవారిపల్లికి చెందిన ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. అతని ద్వారానే శేఖర్ దొంగల ముఠాకు సాయం అందించాడని సమాచారం. పగటిపూట బొగ్గులు కాల్చి, రాత్రిళ్లు దోపిడీలకు పాల్పడేవారని సమాచారం.

ఆకేపాటి రిసెప్షన్‌కు వైసీపీ అధినేత


ఆకేపాడులో నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాజంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి కుమారుడు రిసెప్షన్‌కు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం హాజరయ్యారు. బెంగుళూరు నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆకేపాడుకు వచ్చి ఆకేపాటి అనురాగరెడ్డి, వరదీక్షితరెడ్డి దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, కడప కార్పొరేషన్ చైర్మన్ సురేష్ బాబు, జడ్పీ మాజీచైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, అన్నమాచార్య యూనివర్సిటీ అధినేత చొప్పా గంగిరెడ్డి, వైసీపీ రాజంపేట ఇన్‌చార్జి ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలికారు.

రీసర్వే పారదర్శకంగా నిర్వహించండి

- సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి


రీసర్వే పనుల గురించి ఆరా తీస్తున్న సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి

మదనపల్లెటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి తెలిపారు. మంగళవారం మదనపల్లె మండలం పోతబోలు గ్రామంలో రీసర్వేను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సర్వే నెంబర్‌లోని భూములు, రికార్డులకు అనుగుణంగా సర్వే చేయాలన్నారు. సర్వే సమయంలో సంబంధిత రైతులకు సమాచారం ఇచ్చి వారి సమక్షంలో సర్వే చేస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు. రీసర్వేలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటే రైతులు మళ్లీ మళ్లీ రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో డీఐ వెంకటరమణ నాయుడు, సర్వేయర్ సుబ్రహ్మణ్యం, రీసర్వే డీటీ మౌలా, వీఆర్వో నారాయణ, పోతబోలు మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్‌ఖాన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రతి రోజూ చెత్త సేకరించాలి

- జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి

ఒంటిమిట్ట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతిరోజు చెత్త సేకరించాలని జిల్లా పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి ఆదేశించారు. మంగళవారం మండలంలోని పెన్నపేరూరు, గంగపేరూరు గ్రామాల్లో సౌమిత్వ ఐవీఆర్ఎస్ అమలు పరిస్థితిపై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలని అందుకు అవసరమైన కూలీలు వాహనాలు, డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే అక్కడి ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. సౌమిత్వ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిని కొలిచి, దాని ఆధారంగా ప్రాపర్టీ కార్డును మంజూరు చేయాలన్నారు. గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రజలు కూడా బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రసాద్, గంగపేరూరు పంచాయతీ కార్యదర్శి సౌజన్య, సాలాబాదు పంచాయతి కార్యద్శి చంద్ర తదితరులు పాల్గన్నారు.


సౌమిత్వ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న డీపీవో

ఏజీ గార్డెన్ కాలనీ ఎవరిది...?

- గ్రామ పంచాయతీదా.. మున్సిపాలిటీదా...
- సిమెంటు రోడ్డు, తాగునీరు లేక ఇక్కట్లు



తమ గోడును వెళ్లబోసుకుంటున్న కాలనీవాసులు, (ఇన్‌సెట్లో) ట్యాంకర్ ద్వారా నీటిని కొనుగోలు చేసుకుంటున్న దృశ్యం

రాయచోటిటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న ఏజీ గార్డెన్ కాలనీలో 100 కుటుంబాలకు పైగా అన్ని వర్గాల ప్రజలు నివసిస్తున్నారు. 2009-10 ప్రాంతంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద ఆ కాలనీలో ఇండ్లు లేని పేదలకు ఇంటి పట్టాలిచ్చి గృహాలు నిర్మించారు. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో పాటు లబ్ధిదారులు సొంతంగా కొంత ఖర్చు చేసుకొని ఇళ్లను నిర్మించుకున్నారు. సుమారు 150కి పైగా వివిధ వర్గాలకు చెందిన పేదలు రాయచోటి పట్టణంలో ఇంటి బాడుగలు కట్టలేక ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో కొంత మంది ఇండ్ల నిర్మాణం చేపట్టి నివాసముంటుండగా, మరి కొంత మంది ఆర్థిక స్తోమత లేక అలాగే వదిలేశారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గృహ నిర్మాణశాఖ ద్వారా ఇండ్ల నిర్మాణానికి బిల్లులు చెల్లించడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించి వదిలేశారు. అప్పటి నుంచి కనీస మౌలిక వసతులు లేక ఏజీ గార్డెన్ కాలనీ వాసులు దినదినగండంగా కాలం వెల్లబుచ్చుతున్నారు. ప్రస్తుతం వారి నివసిస్తున్న ఏజీ గార్డెన్ కాలనీకి పక్కనే గల మరో ఇందిరమ్మ కాలనీకి వెలిగల్లు నీటి పథకం నుంచి తాగు నీటి పైపులైను ఏర్పాటు చేసి నీటిని అందిస్తున్న మున్సిపల్ అధికారులు కాలనీకి మాత్రం నీరు ఇవ్వకపోవడం ఆశ్చర్యం. ప్రతి కుటుంబం వారానికి ఒక నీటి ట్యాంకును కొనుగోలు చేయక తప్పడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే ఒకరి మీద ఒకరు పెట్టుకుని కాలయాపన చేయడం పరిపాటిగా మారింది.

ఈ కాలనీ ఎవరి పరిధిలోకి ?

రాయచోటి పట్టణ పరిధిలోని మదనపల్లె రోడ్డులో గల ఏజీ గార్డెన్ ఇందిరమ్మ కాలనీ ఎవరి పరిధిలోకి వస్తుందో ఇప్పటికీ క్లారిటీ లేదు. సుమారు 15 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఇందిరమ్మ పథకం కింద గృహ నిర్మాణశాఖ వారు రాయచోటి పట్టణంలో అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్న పలువురు పేదలకు ఏజీ గార్డెన్ కాలనీలో ఇంటి పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు.

తాగునీరు అసలే లేదు

సుమారు 100 కుటుంబాలకు పైగా నివసిస్తున్న ఈ కాలనీలో నేటికీ అక్కడ సిమెంటు రోడ్లు లేకపోవడం, తాగునీరు అసలే లేకపోవడం చూస్తే వారు పట్టణంలో ఉన్నారా లేక మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్నారా అనే సందేహం కలుగకమానదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని రోడ్ల సమస్య, తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

8 మంది సీఐల బదిలీ

కడప క్రైం ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో పని చేస్తున్న 8మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కడప వీఆర్‌లో ఉన్న జి.సుబ్బారావును కడప టూటౌన్ పీఎస్‌కు, ఎన్.క్రిష్ణయ్యను బద్వేల్ రూరల్ సర్కిల్‌కు బదిలీ చేశారు. బద్వేలు సర్కిల్ నుంచి ఎం.నాగభూషణ్‌ను సీకే దిన్నెకు, ఇక్కడున్న ఎస్‌డీ శివశంకర్ నాయక్ కడప ఎస్బీ-2కు బదిలీ అయ్యారు. ఎస్బీ-2 నుంచి డి.భాస్కర్ రెడ్డి ఎస్బీ-1కు ఇక్కడున్న ఆర్.పురుషోత్తం రాజు కడప ఎస్సీ/ఎస్టీసెల్‌కు, ఇక్కడున్న వి.వేణుగోపాల్ ప్రొద్దుటూరు త్రీటౌన్‌కు, ఇక్కడి నుంచి ఏ.గోవిందరెడ్డి కడప వీఆర్‌కు బదిలీ అయ్యారు.

అంగన్వాడీ కేంద్రంలో సిబ్బంది మధ్య గొడవ

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని మాసాపేట సెక్టారులో ఉన్న సున్నపురాళ్ల మిట్ట 1 అంగన్వాడీ కేంద్రంలో సిబ్బంది గొడవ పడినట్లు తెలుస్తోంది. ఐదురోజుల క్రితం అంగన్వాడీ టీచరు, ఆయా గొడవ పడినట్లు సమాచారం. ఇరువురు పోలీసు స్టేషన్‌కు కూడా వెళ్లినట్లు తెలుస్తుంది. కాగా, ఈవిషయంపై సీడీపీవో విచారణ చేపట్టి ప్రాజెక్టు డైరెక్టరుకు నివేదించారు. ఈ మేరకు మంగళవారం పీడీ కేంద్రానికి వచ్చి ఇరువురితో సంఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ సిబ్బంది గొడవపడ్డారనే విషయంపై విచారణ చేపట్టామన్నారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నట్లు చెబుతున్నారని... ఇందుకు సంబంధించి ఎటువంటి సాక్ష్యాధారాలు లేవని వివరించారు. ప్రస్తుతం అక్కడ ఉన్న కేంద్రాన్ని మరో చోటకు తరలించినటట్లు ఆమె తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

కమలాపురం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని మీరాపురంలో మంగళవారం ఉదయం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామంలో కనిపించిన వారిపై దాడి చేసింది. ఈ దాడిలో గ్రామానికి చెందిన స్బుబ్బమ్మ, అరుణ, సుబ్బరాయుడుకు గాయాలయ్యాయి. వీరిని కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

పంట నష్టం చేశారని కేసు నమోదు

కలసపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నపల్లెలో పంట నష్టం చేశారని ఎక్కలూరు శ్రీనివాసులుపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. గ్రామానికి చెందిన అంకయ్య మరికొందరు సాగు చేసిన సజ్జ పంటను శ్రీనివాసులు ట్రాక్టర్‌తో తొక్కించుకొని వెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపుతప్పి కారు బోల్తా

● ఇద్దరికి స్వల్ప గాయాలు

కొండాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంజిఅనంతపురం గ్రామం వద్ద చిత్రావతి బ్రిడ్జి సమీపంలో మంగళవారం కారు అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికుల సమాచారం మేరకు కారు ప్రొద్దుటూరు నుంచి కళ్యాణదుర్గం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. కారులో నలుగురు ప్రయాణిస్తుండగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

బీ.. కేర్‌ఫుల్

మేల్కోకపోతే ముప్పు తప్పదు

ప్రమాద ఘంటికలు మోగిస్తున్న వంతెనలు

ఆందోళనలో ప్రజలు



పిల్లర్లు దెబ్బతిని అధ్వాన్నస్థితిలో ఉన్న సగిలేరు వంతెన

సగిలేరు వంతెనపై...

కలసపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ కాలంలో కలసపాడు వద్ద సగిలేరుపై నిర్మించిన బ్రిడ్జి ప్రస్తుతం ప్రమాదఘంటికలు మోగిస్తోంది. ఈ వంతెన అధ్వాన్నస్థితికి చేరుకున్న పట్టించుకునేవారే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. ఈ వంతెనకు సంబంధించిన పిల్లర్లు అప్పట్లో రాళ్లతో నిర్మించారు. స్లాబ్ మాత్రం కాంక్రీట్‌తో ఏర్పాటు చేశారు. పోరుమామిళ్ల-గిద్దలూరు ప్రధాన రహదారిలోని కలసపాడు వద్ద సగిలేరుపై నిర్మించిన ఈ వంతెనపై నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ప్రైవేట్, ఆర్టీసీ బస్సులతో పాటు భారీ బరువుతో కూడిన ఇనుము, ఇసుక, కంకర, ధాన్యం బస్తాలతో లారీలు ఈ వంతెనపై వెళ్తుంటాయి. 1996లో వచ్చిన వరదకు వంతనపై పది అడుగుల మేర నీరు ప్రవహించింది. వరద ధాటికి కొన్ని పిల్లర్లు దెబ్బతినడంతో సంబంధిత అధికారులు తాత్కాలికంగా మరమ్మత్తులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. 2020లో కూడా వంతెన పైనుంచి నీరు ప్రవహించింది. ప్రస్తుతం వంతెనపై గుంతలు ఏర్పడటంతో వర్షం వచ్చినపుడు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాతితో నిర్మించిన పిల్లర్లకు నెర్రెలు ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణీకులు, ప్రజలు ఆందోళనలకు గురవుతున్నారు. చిన్నచిన్న రహదారిపై కోట్ల రూపాయలతో వంతెనలు నిర్మిస్తున్న రహదారులు, భవనాలశాఖ అధికారులు ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఈ ప్రధాన రహదారిపై నూతన వంతెన నిర్మాణంపై శ్రద్ధ చూపకపోవడం పట్ల ఈ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కుందూ బ్రిడ్జిపై...

చాపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం గ్రామం వద్ద కుందూ నదిపై నిర్మించిన బ్రిడ్జిపై ప్రమాదం పొంచి ఉంది. ఈ వంతెనను 1927లో బ్రిటీష్‌వారు నిర్మించారు. బ్రిడ్జిపై ప్రతి రోజు వందల సంఖ్యలో వాహనాలు తిరుగు తుంటాయి. అల్లాడుపల్లె, పెద్దగురువలూరు, సీతారామపురం, చిన్నగురవలూరు, మరో ఎనిమిది గ్రామాల ప్రజలు ఈ బ్రిడ్జి గుండా ప్రొద్దుటూరు, మైదుకూరు పట్టణాలకు వెళుతుంటారు. పొలాల్లో పండించిన పంట ఉత్పత్తులను కూడా రైతులు ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో ఇళ్లకు తీసుకుపోతుంటారు. అల్లాడుపల్లె వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు కూడా ప్రొద్దుటూరు నుంచి భక్తులు వస్తుంటారు. కాగా, గత రెండు వారాల నుంచి నదిలో సుమారు 20 అడుగుల లోతు నీళ్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో బ్రిడ్జిపై నీళ్లు పొర్లి ప్రవహించే అవకాశం ఉంది. ఇప్పటికే వంతెన పిల్లర్లలో ఒకటి దెబ్బతినగా.. అధికారులు తాత్కాలిక మరమ్మత్తులు చేసి చేతులు దులుపుకున్నారు. ఇక వంతనపై రక్షణగా ఏర్పాటు చేసిన సిమెంటు దిమ్మెలు దెబ్బతిన్నాయి. దీంతో బ్రిడ్జిపై రాకపోకలు సాగించే సమయంలో ఎప్పుడు ఏం ప్రమాదం సంభవిస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి హైలెవల్ వంతెన నిర్మించాలని కోరుతున్నారు.



సీతారామపురం గ్రామం వద్ద ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

సుస్థిర జీవనోపాధులపై ప్రణాళికలు రూపొందించాలి : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామా ల్లో సుస్థిర జీవనోపాధి, ఆర్థిక అభివృద్ధి సాధనకు స్వయం సహాయక సంఘాలను, రైతు ఉత్పత్తి సంస్థలను బలోపేతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో గ్రామీణాభివృద్ధి, బ్యాంకింగ్, వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అన్ని విధాల అభివృద్ధి పథంలో నడవాలంటే అన్ని ప్రాధాన్యత రంగ శాఖలు సమన్వయంతో కేటాయించిన లక్ష్యాలను అధిగ మించాలన్నారు. ముందుగా అన్ని గ్రామాల్లో సామాజిక ఆర్థిక స్థితిగతులు, అక్కడ అందుబా టులో ఉన్న వనరులను సద్వినియోగం చేసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లాలో గ్రామీ ణాభివృద్ధి సంస్థ రెండేళ్లుగా పేదరిక నిర్మూలన కోసం పాటు పడుతోందన్నారు. 26,965 స్వయం సహాయక సంఘాల ద్వారా 2.62 లక్షల మంది మహిళలు ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారన్నారు. అధిక శాతం వ్యవ సాయ రంగ అనుబంధ రంగాల్లో ఉపాధి పొందుతున్నారని తెలిపారు. కార్యక్ర మంలో డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి గ్రామాల్లో సుస్థిర జీవనోపాధి కల్పనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో బ్యాంకు అధికారులు, వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వైవీయూ క్యాంపస్ కళాశాలలో డిగ్రీకోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని పోస్టు గ్రాడ్యుయేషన్ కళాశాలలో పలు కోర్సులలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు విశ్వవిద్యాలయ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్ వెల్లడించారు. నాలుగేళ్ల హానర్స్ కోర్సులైన బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ కోర్సులు, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులైన బయో టెక్నాలజీ అండ్ బయో ఇన్‌ఫర్మేటిక్స్, అప్లైడ్ జియాలజీ కోర్సులలో అడ్మిషన్లు ఉంటాయన్నారు. ఈ కోర్సులలో చేరడానికి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత చాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్ అడ్మిషన్ మాడ్యుల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఓఎఎండీసీ) సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పరిశోధన, అకడమిక్‌లో అపారమైన అనుభవం గల అధ్యాపకులచే ప్రయోగ, పరిశీలనాత్మక విద్యాబోధన ఆధునిక విధానంలో ఉంటుందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం అనుసరించి విద్యాబోధన, సెమినార్లు, సింపోజిఎంలు, వర్క్‌షాపుల ద్వారా విస్తృత జ్ఞానం పొందే అవకాశం ఉంటుందన్నారు. క్యాంపస్ డ్రైవ్ ద్వారా ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. 50వేల పుస్తకాలతో గ్రంథాలయం విద్యార్థులకు అందుబాటులో ఉందన్నారు. బాల బాలికలకు వేర్వేరుగా వసతిగృహాలు ఉన్నాయని తెలిపారు.

ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో పరీక్ష ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ప్లానింగ్, ఫైన్ ఆర్ట్స్ విభాగాలకు సంబంధించి 2,4,6వ సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాలను వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.విశ్వనాథకుమార్ మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో వర్సిటీ అదనపు పరీక్షల నియం త్రణాధికారి డాక్టర్ జి.ఫణీంద్రరెడ్డి, సహాయ పరీక్షల నియంత్రణాధికారి ఉదయ ప్రకాష్‌రెడ్డి, నారపరెడ్డి పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ

అదృశ్యమైన నాగేశ్వరరావు ఆచూకీ నిగ్గుతేల్చాలి

● నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహరావు



మాట్లాడుతున్న నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహరావు

కడప మారుతీనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లకు చెందిన గుర్రం శ్రీనివాసరావు అనే వ్యక్తితో కలిసి దాదాపు 17 ఎకరాలలో జామ పంటను సాగు చేసి తీరా పంట చేతికి వచ్చే సమయంలో కనిపించ కుండా పోయిన బాపట్ల జిల్లా బట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామ నాయీబ్రాహ్మణ కులానికి చెందిన మోపిదేవి నాగేశ్వరరావు ఆచూకీని ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం నిగ్గుతేల్చాలని నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరుమామిళ్లలోని పులివీడు గ్రామానికిచెందిన ఖాజాపీర్ దగ్గర నుండి 17 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని గుర్రం శ్రీనివాసరావుతో కలిసి నాగేశ్వరరావు పంట సాగు చేశారన్నారు. మూడేళ్లుగా పంట సాగుచేసి తీరా పంట చేతికివచ్చే సమయంలో గత ఏప్రిల్ 7వ తేదీ నుంచి నాగేశ్వరరావు కనిపించకుండా పోయారన్నారు. ఈ విషయంపై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. తదనంతరం నాగేశ్వరరావు భార్య నవ్యశ్రీ మాట్లాడుతూ తన భర్త కనిపించకుండా పోవడానికి ప్రధాన కారకుడు గుర్రం శ్రీనివాసరావు అని ఆరోపించారు. జామ పంట సాగుకు దాదాపు రూ.13 లక్షలు ఖర్చు చేయగా కౌలు నిమిత్తం ఖాజాపీర్‌కు రూ.7 లక్షలు చెల్లించినట్లు వెల్లడించారు. డబ్బులతో పాటు భర్త కనిపించకపోవడంతో ఇద్దరు పిల్లలతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు త్వరితగతిన స్పందించి నా భర్త ఆచూకీ తెలపాలని కోరారు.

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి రూ.2.5 లక్షల ఆర్థిక సాయం




హెడ్‌కానిస్టేబుల్ భార్య జయలక్ష్మికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యతో మరణించిన హెడ్‌కానిస్టేబుల్ ఎం.నాగార్జునరెడ్డి (హెచ్‌సీ 1071) కుటుం బానికి ఎస్పీ అశోక్‌కుమార్ రూ.2.5 లక్షల ఆర్థికసాయం అందించారు. పోలీసు సంక్షేమంలో భాగంగా పోలీసు వితరణ నిధి నుంచి ఈ మొత్తాన్ని మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హెడ్‌కానిస్టేబుల్ సతీమణి ఎం.జయలక్ష్మికి అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ హెడ్ కానిస్టేబుల్ కుటుంబ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసుశాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన) కె.ప్రకాశ్ బాబు, ఏవో కె.వెంకటరమణ, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్ పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు కేటాయించాలి


● జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం విడుదల చేసే నిధులు కీలకంగా మారుతాయని త్వరలో వాటిని విడుదల చేయాలని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం అమరావతిలోని ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ కార్యాలయ ప్రత్యేక ఓఎస్‌డీ కె.వెంకటకృష్ణను కలిసి ఆయన ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన సర్‌చార్జిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కడపజిల్లాలో కూడ నుంచి గత 22 నెలలుగా కొత్తపల్లె పంచాయతీకి, జిల్లాలోని ఇతర పంచాయతీలకు రావాల్సిన నిధులను విడుదల చేయాలని పేర్కొన్నారు. అలాగే 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. దీంతో ఓఎస్‌డీ సానుకూలంగా స్పందిస్తూ ఉపముఖ్యమంత్రితో చర్చించి వీలైనంత త్వరగా పంచాయతీలకు నిధులను విడుదలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని శివచంద్రారెడ్డి తెలిపారు.



ఆశల.. ఖరీఫ్

● పుంజుకుంటున్న పంటల సాగు
● ఊపిరి పోసిన వరుణుడు
● వారం రోజులుగా వర్షాలు
● 15,748 హెక్టార్లలో పంటలు
● 20.33 శాతానికి చేరిన సాగు



దేవుని కడప చెరువు కింద వరినాట్లు వేస్తున్న కూలీలు

కడప రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ఆశలు చిగురిస్తున్నాయి. నిన్నటివరకు మందకొడిగా సాగిన ఖరీఫ్ ఇప్పుడు నెమ్మదిగా పుంజుకుంటోంది. గత వారం రోజుల నుంచి జిల్లాలో ఆశాజనకంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో ఖరీఫ్ సాగులో కదలిక వచ్చింది. జూన్ మొదటి వారంలో సీజన్ ప్రారంభమైంది. అంతకు మునుపు మే నెల చివరిలో పదును వర్షాలు పడ్డాయి. ఈ వర్షాలకు కొందరు రైతులు ఖరీఫ్‌లో భాగంగా అక్కడక్కడ వేరుశనగ, పత్తి, కంది, మినుము తదితర పంటలను సాగుచేశారు. ఆ తరువాత ఆగస్టు నెల మొదటి వారం వరకు దాదాపు రెండు నెలలు పైబడి వర్షాభావం వెంటాడడంతో ఖరీఫ్ సాగు మందకొడిగా సాగింది. దీంతో 77,475 హెక్టార్ల సాగుకు గాను జూలై 3 నాటికి కేవలం 2565 హెక్టార్లు మాత్రమే (3.31 శాతమే) సాగైంది. ఈ నేపధ్యంలో గత వారం రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా ఆశాజనకంగా వర్షాలు పడుతుడటంతో ఖరీఫ్ పంటల సాగు గణనీయంగా పెరుగుతోంది. గురువారం నాటికి 15,748 హెక్టార్లలో (20.33 శాతం) పంటలు సాగుకు నోచుకున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తెరపి ఇవ్వగానే ఖరీఫ్ సాగు మరింత జోరందుకోనుంది. దీంతో సాగు లక్ష్యాన్ని సాధించేందుకు వ్యవసాయశాఖ అధికారులు వడివడిగా అడుగులు వేస్తున్నారు.

వర్షాలతో మెట్టపంటలకు ప్రాణం

తీవ్ర వర్షాభావ పరిస్థితులు, అడుగంటిన భూగర్భజలాలు, నిండని జలాశయాలు ఇలాంటి విపత్కర పరిస్థితుల నుంచి జిల్లా రైతాంగం క్రమంగా బయటపడుతోంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో మెట్టపంటలకు ప్రాణం పోసినట్లయింది. మరోవైపు పెన్నా, కేసీ కెనాల్‌కు ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం ఉండడంతో ఆయకట్టుకు నీటి విడుదల పెరిగింది. దీంతో వరినాట్లు జోరందుకున్నాయి. అలాగే జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతాంగంలో ఆశలు చిగురించేలా చేస్తున్నాయి. ఖరీఫ్ ప్రారంభం నుంచి ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో జిల్లా రైతాంగానికి ఎదురుచూపులు తప్పలేదు. వారం రోజులనుంచి కురుస్తున్న వర్షాలతో చేతికి రాకుం డా పోతాయని భావించిన మెట్టపంటలకు సైతం ప్రాణం పోసినట్లయింది. పత్తి, వేరుశనగ, కంది, మినుము, పెసర పంటలకు ఊపిరి వస్తోంది.

15,748 హెక్టార్లలో పంటలు

జిల్లాలోని సాగు విస్తీర్ణంలో అత్యధిక భూభాగం వర్షాధారంపై ఆధారపడింది. ఇందులో ఖరీఫ్ సీజన్ ప్రథమ ప్రాధాన్యతగా వస్తోంది. జిల్లాలో 2025 ఖరీఫ్‌కు గాను సాధారణ విస్తీర్ణం కింద 77,475 హెక్టార్లు సాగు లక్ష్యంగా అధికారులు నిర్ధారించారు. ఇప్పటి వరకు ఖరీఫ్ మధ్యస్థానికి వచ్చింది.
గురువారం నాటికి అన్ని రకాల పంటలను కలుపుకుని 15,748 హెక్టార్లలో సాగుకు నోచుకున్నా యి. వీటిలో ప్రధానమైన వరి పంట 30,804 హెక్టార్లకు గాను 6568 హెక్టార్లలో, మొక్కజొన్న 932 హెక్టార్లకు 1772 హెక్టార్లలో, కంది 5761 హెక్టార్లకు 285 హెక్టార్లలో, మినుము పంట 3806 హెక్టార్లకు 1502 హెక్టార్లలో, పత్తి పంట 24,036 హెక్టార్లకు 3524 హెక్టార్లలో, వేరుశనగ 5,976 హెక్టార్లకు 983.88 హెక్టార్లలో, సన్‌ఫ్లవర్ 1142 హెక్టార్లకు 225 హెక్టార్లలో, ఇతర పంటలు ఆయా హెక్టార్లలో వెరసి ఇప్పటి వరకు 20.33 శాతం మేర సాగుకు నోచుకున్నాయి.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రేపు మెగా జాబ్‌మేళా

రాజంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పురుషోత్తం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నారని, పదో తరగతి నుంచి డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన, సాంకేతిక విద్యను అభ్యసించిన వారు జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు. జాబ్‌మేళాలో వచ్చే వారు ఆధార్ కార్డు, ఫొటోలు, ఒరిజినల్, ఫొటో స్టాట్ విద్యార్హత సర్టిఫికెట్లను తీసుకురావాలని తెలిపారు.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

నందలూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రజలు వినాయక విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 27న వినాయక చవితి పండుగ సందర్భంగా తమ గ్రామాల్లో వినాయక విగ్రహాలను పెట్టుకోవాలనుకున్న ప్రజలు ఉత్సవ కమిటీ సభ్యులు తమ ఆధార్‌కార్డులతో స్థానిక పోలీసు స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు తీసుకొని తగిన సమాచారం ఇచ్చి అనుమతి తీసుకోవాలని ఎస్ఐ వివరించారు.

ఆంజనేయస్వామికి పూజలు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిశ్చల్ నాగిరెడ్డి

చిన్నమండెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మంగళ వారం సందర్భంగా మండలంలోని చాకిబండ ఆంజనేయస్వామి ఆలయంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుమారుడు నిశ్చల్ నాగిరెడ్డి పూజలు చేశారు. అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండిపల్లి అభిమానులు, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చినుకుపడితే.. చెరువే!



గుండాలపల్లెలోని ఒక వీధిలో బురద, వర్షపు నీరు

రైల్వేకోడూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): చినుకు పడితే చాలు గుండాలపల్లెలోని వీధులు చెరువుల్లా మారిపోతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా వర్షం కురుస్తుండడంతో రోడ్లు జలమయం అయ్యాయి. గ్రామంలోని సిమెంటు రోడ్లన్నీ దెబ్బతినడంతో వర్షపునీరు ఎక్కడికక్కడ నిలిచి, బురద పేరుకుపోతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సిద్దవటం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న ట్రాక్టర్ హఠాత్తుగా ఆగడంతో దాని వెనుకే బైక్‌పై వస్తున్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు కడపకు చెందిన గోకుల వెంకటశివ, షేక్ చాంద్‌బాషా, మంగళవారం ఉదయం ఒంటిమిట్ట మండలం మాధవరంలో షోకేస్ పనులు చేసేందుకు వచ్చారు. సాయంత్రం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై కడపకు బయలుదేరారు. ఎస్‌కేఆర్ నగర్ సమీపంలో ముందు వెళుతున్న ట్రాక్టర్ హఠాత్తుగా ఆగడంతో వీరు ప్రయాణిస్తున్న బైక్ ట్రాక్టర్‌ను ఢీకొంది. దీంతో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి తమకు ఎలాంటి సమాచారం అందలేదని ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు.

ముఖాముఖి నిర్వహించారు.. రుణాలు మరిచారు!

● ఆరు నెలలుగా అభ్యర్థుల ఎదురు చూపు ● సబ్సిడీ మంజూరు కాలేదంటున్న బ్యాంకర్లు



ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగులు (ఫైల్)

రైల్వేకోడూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఇంటర్వ్యూలు పూర్తై ఆరు నెలలు గడుస్తున్నా రుణాలు మంజూరు చేయకుండా అధికారులు బ్యాంకుల చుట్టూ తిప్పుకుంటున్నారని కాపు, బీసీ, ఓసీ వర్గాలకు చెందిన నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు.

ఈ ఏడాది ఫిబ్రవరి 19న కాపు, బీసీ, ఓసీ కులాలకు చెందిన అభ్యర్థులకు రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల అభివృద్ధి అధికారుల కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. రైల్వేకోడూరు మండలంలో కాపు కార్పొరేషన్ కింద 15 మంది, బీసీ కార్పొరేషన్ కింద 65 మంది, ఓసీ కింద 15 మందిని ఎంపిక చేశారు. ఓబులవారిపల్లె మండలంలో మూడింటిలో 40 మందిని, పెనగలూరు మండలంలో 40 మంది, పుల్లంపేట మండలంలో 60 మంది, చిట్వేలి మండలంలో సుమారు 45 మందిని ఎంపిక చేసి జాబితాను బ్యాంకులకు పంపారు. అయితే, 5 నెలలు కావస్తున్నా ఇంత వరకు రుణాలకు సంబంధించిన సబ్సిడీ జమ కాకపోవడంతో వారు కూడా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. రుణాలు ఇచ్చి ఉంటే జీవనోపాధి పొందే అవకాశం ఉండేదని పలువురు అంటున్నారు. సబ్సిడీ ఎందుకు విడుదల చేయలేదో, ఇందుకు కారణం ఏమిటో అన్నది అంతు చిక్కకుండా పోయిందని లబ్ధి దారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకుని సబ్సిడీని ఆయా బ్యాంకులకు వేయాలని లబ్దిదారులు వేడుకుంటున్నారు.

సబ్సిడీ అందితేనే రుణాల మంజూరు

. గతంలో రుణాలను మంజూరైన వెంటనే ఇచ్చే వారని, అయితే పలువురు రుణాలను ఎగవేస్తుండడంతో, సబ్సిడీ అందిన తర్వాతే రుణాలు ఇవ్వాలని ఈ ఏడాది బ్యాంకర్లు నిర్ణయించారని అనంతరాజుపేట ఏపీజీబీ మేనేజర్ సాగర్ వివరించారు . లబ్ధిదారు రుణం చెల్లించకపోతే బ్యాంకు సబ్సిడీ మొత్తాన్ని జమ చేసుకుంటుందని ఆయన వివరించారు.

సబ్సిడీని వెంటనే విడుదల చేయాలి



వివిధ కార్పొరేషన్ల కింద మహిళలే ఎక్కువగా రుణాలకు ఎంపికయ్యారు. సబ్సిడీ విడుదల చేస్తే బ్యాంకు వారు రుణాలు ఇస్తారు. దీంతో మహిళలు ఆర్థికంగా ఎదుగేందుకు వీలు అవుతుంది. వెంటనే ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరుకుంటున్నాము.

- వరికూటి సింధుమాధురి, మైసూరివారిపల్లె

రుణాల మంజూరుతో మహిళల జీవితాల్లో వెలుగు



రుణాలను మంజూరు చేస్తే మహిళల జీవితాల్లో వెలుగు నింపినట్లు ఉంటుంది. ఇప్పటికే 5 నెలలు గడిచింది. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకుని అర్హులైన వారందరికీ రుణాలు మంజూరు చేయిస్తే మహిళలు ప్రభుత్వానికి రుణపడి ఉంటారు.

- ముద్దపోలు సుశీల, అనంతరాజుపేట

సమాచార హక్కు చట్టంపై సహకార ఉద్యోగుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు

రాయచోటిటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించడంలో భాగంగా మంగళవారం సహకారశాఖకు సంబంధించిన ఉద్యోగులతో పాటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సిబ్బంది, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగులు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి ఎస్ఎండీ హబీబుల్లా మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థల్లో, కార్యాలయంలో ఏం జరుగుతుందో తెలుసుకునే హక్కు ఈ చట్టం కల్పించిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు జవాబుదారీగా ఉండి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్న పౌరులకు పరిమితులకు లోబడి సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ప్రజలు కోరిన సమాచారం ఇచ్చినప్పుడే ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలు పారదర్శకంగా పనిచేస్తాయన్నారు. ఫలితంగా అధికారుల్లో జవాబుదారీతనం పెరుగుతుందని, సమాచార హక్కు చట్టాన్ని అమలు పరిచినప్పుడే అవినీతి అక్రమాలు లేని సమాజం సాధ్యమవుతుందని తెలిపారు. అందుకోసమే భారత ప్రభుత్వం సమాచార హక్కు చట్టం 2005 రూపొందించిందని, ప్రజలందరూ ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమన్నారు. అంతకు ముందు మట్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో అన్నమయ్య జిల్లా సహకారశాఖ ఉద్యోగులు, సహకార సంఘాల సిబ్బంది, రాయచోటి డీసీసీబీ సిబ్బంది సమావేశం నిర్వహించి సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్యామ్‌ప్రకాశ్, డీసీఏవో ఆఫీస్ సూపరింటెండెంట్ కొండారెడ్డి, సంపత్, ఆడిటర్లు సురేశ్‌బాబు, ఇషత్, ప్రకాశ్, రఘునాథరెడ్డి, బ్యాంక్ చీఫ్ మేనేజర్ గంగాధర్, సబ్ డివిజన్ పరిధిలోని సొసైటీ సీఈవోలు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్ : పట్టణంలో సమాచార హక్కు చట్టంపై ర్యాలీ నిర్వహించారు. స్థానిక డీసీసీ బ్యాంకులో అధికారులకు రాజంపేట ప్రత్యేక అధికారి, జిల్లా కోఆపరేటివ్ అధికారి గురుప్రకాష్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డీసీసీ బ్యాంకు అధికారులు, సిబ్బంది, ఆర్టీసీ ఎన్ఎంయూ అధికారులు, వెటర్నరీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి



ఎంపీడీవో మల్‌రెడ్డికి సమస్య వివరిస్తున్న పెన్షన్ కోల్పోయిన వారు

ఓబులవారిపల్లె, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పెన్షన్‌పైనే ఆధారపడి జీవిస్తున్న తమను అనర్హులుగా గుర్తించడంతో జీవనాధారం కోల్పోయి ఇబ్బందులు పడుతున్నామని వై.కోటకు చెందిన అడపాల ప్రేమ్ కుమార్, టీడీపీ నాయకుడు బజార్ సుబ్రమణ్యంతో కలిసి పలువురు దివ్యాంగులు మంగళవారం ఎంపీడీవో అన్నారెడ్డి మల్‌రెడ్డిని కలిసి తమ గోడును వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పెన్షన్ కోల్పోయిన దివ్యాంగులందరి వివరాలు సేకరించి, వారందనీ ఈ తిరిగి వైద్య పరీక్షలకు పంపేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాధికారులు, బాధితులు పాల్గొన్నారు.

రామాపురం: మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలో 192 పింఛన్లు రద్దు అయినట్లు ఎంపీడీవో జాషువా తెలిపారు. గత నెలలో అంగవైకల్యాల పరీక్షలు చేయించుకునేందుకు పలువురు పింఛనర్లను సదరం ద్వారా ఆసుపత్రికి పంపించగా, వైకల్య నిర్ధారణ పత్రాలు ఆయా గ్రామ సచివాలయాలకు వచ్చాయన్నారు. దీంతో 192 పింఛన్లు రద్దు అయ్యాయన్నారు. వారిలో కొందరికి వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేస్తారన్నారు. పింఛన్లు రద్దయిన దివ్యాంగులు ఈ నెల ఆఖరులోపు తాము పింఛన్లకు అర్హులమేనంటూ ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతిపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడు గాలివీటి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట : స్థానిక ఎంపీడీవో జయశ్రీని మంగళవారం విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం అధ్యక్షుడు సుబ్బనరసారెడ్డి, ఉపాధ్యక్షుడు వాహిద్ కలిసి మండలంలో నోటీసులు అందిన ప్రతిభావంతులకు అన్యాయం జరగకుండా చూడాలని విన్నవించారు.

సమాజ శ్రేయస్సుకు ప్రతి ఒక్కరు పాటుపడాలి




శాంతి ర్యాలీలో పాల్గొన్న అధికారులు, మానవత సంస్థ సభ్యులు

రాయచోటిటౌన్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని అర్బన్ ఎస్ఐ విష్ణువర్ధన్, డిప్యూటీ తహసీల్దార్ వంశీరెడ్డి, విద్యాశాఖ రిటైర్డ్ అధికారి రెడ్డెన్న పిలుపునిచ్చారు. రాయచోటి మానవత సంస్థ చైర్మన్ అరమాటి శివ గంగిరెడ్డి, అధ్యక్షుడు అంకం జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాయచోటి పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండు కూడలి, కంసలవీధి, ఠాణాసర్కిల్, నేతాజీ సర్కిల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆగస్టు 15 నుంచి 22 వరకు మానవత సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా శాంతి ర్యాలీలు నిర్వహిస్తుందన్నారు. అందులో భాగంగానే మంగళవారం రాయచోటి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్నారని తెలిపారు. డీఎస్పీ కృష్ణమోహన్, అర్బన్ సీఐ వెంకటచలపతి, ట్రాఫిక్ సీఐ కుళ్లాయప్ప ఆధ్వర్యంలో ఎస్ఐలు జహీర్, విష్ణువర్ధన్, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మున్సిపల్ డీఈ విజయ్‌కుమార్, గౌరవ సలహాదారు వెంకట్రమణ, మానవత ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షుడు మురళీ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: చిట్వేలిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ప్రపంచశాంతి కోసం ఐదు నిముషాలు మౌనం పాటించారు. ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి, మానవత సంస్థ చైర్మన్ కె. సాయిరాం, అధ్యక్షుడు తిరుమల విశ్వనాథం, కార్యదర్శి మునిరావు, ట్రెజరర్ సుబ్రమణ్యంరెడ్డి, అడ్వైజరీ బోర్డు మెంబర్లు రంగారెడ్డి, జనార్దన్‌రావు, వెంకటేశ్వర్లు, సభ్యులు చంద్ర, నేపథ్య గాయకులు పెంచల్‌దాస్, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఆపస్ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



రమేశ్‌నాయక్, రవీంద్రబాబు, రెడ్డెయ్య

గాలివీడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల ఆపస్ అధ్యక్షుడిగా మూడే రమేశ్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శిగా బుక్కపట్నం రవీంద్రబాబు, కోశాధికారిగా కే. రెడ్డెయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల గౌరవాధ్యక్షులుగా విజయభాస్కర్‌రెడ్డి, శివరామిరెడ్డిలను ఎన్నుకున్నారు. మంగళవారం మండల ఆపస్ కార్యాలయంలో నిర్వహిం చిన ఎన్నికను జిల్లా అధ్యక్షుడు ఎం. నరసింహులు, జిల్లా సహాధ్యక్షుడు జీ. నాగేంద్ర బాబు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. మండల ఉపాధ్యక్షుడుగా జెడ్పీ హైస్కూల్ పీడీ చిన్నకోట్ల గంగరాజు, హసనాపురం దామోదర్, మండల సహాధ్యక్షుడుగా ఎం. రెడ్డెయ్య రాజు, నరేంద్రనాయక్‌లు ఎన్నికయ్యారు. మహిళా కన్వీనర్‌గా కే. నాగలక్ష్మి, క్రీడా కన్వీనర్‌గా శ్రీవాణి, మండల కార్యదర్శులుగా డీవీ రమణ, గోపాల్‌నాయక్, మనోహర్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి జిల్లా ఉపాధ్యక్షుడు రామేశ్వర్ శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయుల సమస్యలపై ఆపస్ నిరంతరం శ్రమిస్తుందని, రాజీలేని పోరాటం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవీంద్రనాయక్, అధిక సంఖ్యలో ఆపస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు శుభ్రం చేయించిన పంచాయతీ సిబ్బంది

సిద్దవటం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా మండలంలోని వెలుగుపల్లెలో రోడ్డు దుస్థితిపై కంపు కొడుతున్న రహదారి అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం ఆయా ప్రాంతాలను శుభ్రం చేయించి అబేట్ పిచికారీ చేయించడంతోపాటు, బ్లీచింగ్ చల్లించినట్లు పంచాయతీ సెక్రెటరీ జానకి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'అన్నదానంతో ఆత్మ సంతృప్తి'



అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న మండిపల్లి లక్ష్మిప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పేదలకు అన్నదానం చేయడంలోనే మనిషికి ఆత్మ సంతృప్తి ఉంటుందని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాసాపేట మార్కెట్ యార్డులోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు రూ.5లకే భోజనం అందించాలనే సదుద్దేశంతో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు పేదలకు భోజన సౌకర్యం కల్పిస్తోందన్నారు. ఈ ట్రస్టు ద్వారా రాయచోటిలోని రెండు అన్న క్యాంటీన్‌లకు ప్రతి నెల సుమారు రూ.3 లక్షలు ఖర్చు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచులు జిలానీబాషా, బాబురెడ్డి, టీడీపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దురాక్రమణదారులపై చర్యలు తీసుకోండి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్ఆర్ఐ జయరాం

సిద్దవటం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధ వరం 1, 2, 3 వార్డుల్లోని ప్రభుత్వ స్థలాలను బినామీ పేర్లతో ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎన్ఆర్ఐ బొడిచెర్ల జయరాం మంగళవారం తహసీల్దారు ఆకుల తిరుమల బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖరాజుపల్లె రెవెన్యూ సర్వేనంబర్లు 427/1, 427/2, 459లో ఐదెకరాలు పైగా కబ్జా చేసి, సెంటు రూ.3 లక్షలతో విక్రయిస్తున్నాడని, వైసీపీ హయాంలో నకిలీ పత్రాలు సృష్టించి కొండలు, వాగులు, గుట్టలు కాజేశారని, వీటిపై సమగ్ర విచారణకు రెవెన్యూ సీసీఎల్‌లో ఫిర్యాదు కూడా చేశామని తెలిపారు. రెవెన్యూ యంత్రాంగం విచారణ చేసి ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని కోరారు.

'భూ సమస్యల పరిష్కారం కోసమే రీసర్వే'

భూ సమస్యలు పరిష్కరించేందుకే రీసర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు తిరుమలబాబు తెలిపారు. మంగళవారం టక్కోలి గ్రామ సచివాలయంలో కడపాయపల్లె వాసులకు జాయింట్ ఎల్పీఎంలపై అవగాహన కల్పించారు. కుటుంబ తగాదాలు, భూ సమస్యల కారణంగా సరైన డాక్యుమెంట్లు చూపించకపోవడం, విస్తీర్ణం, తదితర సమస్యల కారణంగా 53 జాయింట్ ఎల్పీఎంలు ఏర్పడ్డాయని, ఈ భూముల యజమానులకు అన్నదాత సుఖీభవ వంటి ప్రోత్సాహకాలు అందవని రైతులకు వివరించారు. సరైన డాక్యుమెంట్లు చూపించిన వారికి సింగిల్ ఎల్పీఎంలుగా మార్చుకునేందుకు మార్గదర్శకాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరసింహప్రసాద్, డిప్యూటీ సర్వేయర్ సోమశేఖర్, వీఆర్వో రజని, విలేజ్ సర్వేయర్ కారుణ్య, నాగమునిరెడ్డి పాల్గొన్నారు.

తాత్కాలిక విద్యుత్ మీటర్లకు దరఖాస్తుల ఆహ్వానం

పెనగలూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వినాయకచవితి మండపాలకు తాత్కాలిక విద్యుత్ మీటర్లకు నిర్వాహకులు దరఖాస్తులు చేసుకోవాలని పెనగలూరు ఏఈ ఆర్.ఓబుల్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తులు స్థానిక సచివాలయాల్లో కాని, మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రూ.100 దరఖాస్తు ఫీజు, 50 రూపాయలు మీసేవ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దీనికి తోడు 500 వాట్స్‌కు వెయ్యి రూపాయలు, రూ.1000 వాట్స్‌కు రూ. 1000 చెల్లించాలన్నారు. ఇలా ప్రతి 500 అదనపు వాట్స్‌కు రూ.500 అదనపు ఫీజు ఉంటుందన్నారు. ఈ మేరకు 10 రోజులకు వెయ్యి వాట్స్‌కు రూ.15,750 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయాలను వినాయక మండపాలు ఏర్పాటు చేసే ప్రతిచోట గుర్తు పెట్టుకోవాలని కోరారు.

బస్సు పాసుల కౌంటర్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

రాజంపేట టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండులో విద్యార్థులకు బస్సు పాసుల జారీ చేసే కౌంటర్ నిర్వహిస్తున్న కిశోర్ దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, విద్యార్థి సంఘం నేతలు మంగళవారం స్థానిక ఆర్ అండ్ బీ బంగ్లాలో కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల బస్ పాసుల మంజూరుకు నిర్ణయించిన మొత్తం కన్నా అధికంగా వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. కలెక్టర్ స్పందిస్తూ ఈ విషయంపై విచారణ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్, పీడీఎస్‌యూ పట్టణ నాయకులు పృథ్వీ, సాధిక్, వెంకట మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వసతులు కల్పించాలి

ఓబులవారిపల్లె, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో ఉన్న సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహంలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో అన్నారెడ్డి మల్‌రెడ్డి హాస్టల్ వార్డెన్‌కు తెలిపారు. మంగళవారం వసతి గృహాన్ని సందర్శించిన ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని మండల విద్యాశాఖాధికారి హాస్టల్ వార్డెన్, సిబ్బందికి సూచించారు.

రైతులు మిశ్రమ సాగు విధానం అవలంబించాలి

వీరబల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రైతులు మిశ్రమసాగు విధానం అవలంబించాలని జీవనోపాధుల ప్రాజెక్టు మేనేజర్ కోళ్ల గంగార్జున తెలిపారు. మంగళవారం బాలసానివాండ్లపల్లెలో రైతు అరుణమ్మ పొలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈమె 20 రకాల ఆకుకూరలు సాగు చేయడంతో ఒక పంట తర్వాత మరో పంట ద్వారా ఆదాయం వస్తోందన్నారు. చీడపీడల నివారణకు పురుగు మందులకు బదులు కషాయాలను వాడుతున్నారన్నారు. మండలంలోని వీరబల్లి, సోమవరం గ్రామాల్లో సమగ్ర వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఖాదర్‌వలి, సీసీలు గంగాధరం, నాగేంద్ర, యాంకర్ పర్సన్ అనిత, సీఆర్‌పీలు అనురాధ, జ్యోతి, రైతుమిత్ర జనమేజయుడు, వెంకటేశ్ పాల్గొన్నారు.

మొహిద్దీన్‌సాహెబ్‌పల్లెలో వైద్య శిబిరం



గ్రామంలో విచారణ చేస్తున్న వైద్య సిబ్బంది

సిద్దవటం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొహిద్దీన్ సాహెబ్ పల్లె ఎస్సీ కాలనీకి చెందిన దాదాపు 10 మందికి పైగా వారం రోజులు విష జ్వరంతో సమతమతమవుతున్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు మంగళ వారం మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి 18 మంది జ్వరపీడితులను గుర్తించి చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.శ్రావణి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు పూజలు

ఓబులవారిపల్లె, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్న ఓరంపాడు గ్రామ పంచాయతీ కప్పరపల్లెలోని ఆలయంలో ప్రతిష్ఠించనున్న గ్రామ దేవత విగ్రహాలకు మంగళవారం గ్రామస్తులు పూజలు నిర్వహించారు. హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు.

గుర్రంకొండలో చోరీ.. పీలేరులో ప్రత్యక్షం



పీలేరు టోల్‌గేట్ వద్ద నిందితులు వదిలి వెళ్లిన లారీ

గుర్రంకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులో మాయ మైన లారీ పీలేరు టోల్‌గేట్ వద్ద ప్రత్యక్షం కావడంతో లారీ యాజమానులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్ యార్డులో ఎన్నడూ లేని విధంగా లారీ చోరీకి గురవడం వ్యాపారులను విస్మయానికి గురిచేస్తోంది. వ్యాపారుల వివరాల మేరకు గుర్రంకొండ మార్కెట్ యార్డులో బాబాజాన్ టమోటా వ్యాపారాలను సాగిస్తున్నాడు. ఈ క్రమంలో టమోటాలను బయటి ప్రాంతాలకు తరలించడానికి సొంతంగా లారీలను ఏర్పాటు చేసుకున్నాడు. ఇటీవల మార్కెట్‌కు టమోటాలు తగ్గడంతో వ్యాపారాలు మందగించాయి. దీంతో రాత్రి పూట లారీలను మార్కెట్ యార్డులోనే ఉంచి ఇళ్లకు వెళతారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి మార్కెట్ యార్డులో ఉన్న 14 చక్రాల లారీని గుర్తుతెలియని నిందితుడు అపహరించి పీలేరు టోల్‌గేట్ వద్ద వదిలివెళ్లాడు. విషయం తెలుసుకున్న బాధితుడు లారీ చోరీకి గురైనట్లు గుర్తించి సీసీ కెమెరాలను పరిశీలించి పీలేరు టోల్ గేట్ వద్ద నిందితుడు వదిలివెళ్లినట్లు తెలుసుకుని లారీని గుర్రంకొండకు తీసుకొచ్చారు. లారీ చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వ్యాపారీ తెలిపాడు. పోలీసులు విచారించి నిందితుడిని పట్టుకుంటామని ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు.

విషద్రావణం సేవించి యువరైతు ఆత్మహత్య

● చెట్లవారిపల్లెలో విషాదం


వంశీకృష్ణారెడ్డి (ఫైల్)

ములకలచెరువు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... చౌడసముద్రం పంచాయతీ చెట్లవారిపల్లెకు చెందిన వెంకటస్వామిరెడ్డి కుమారుడు వంశీకృష్ణారెడ్డి(30) వ్యవసాయంలో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. తండ్రి అప్పులు చేయడంతో పాటు బీటెక్ చదువుకున్న తనకు ఉద్యోగం రాలేదని మనస్థాపం చెందాడు. ఈ క్రమంలో ఈ నెల 10న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబీకులు హుటాహుటిన చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయిస్తున్నారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. యువరైతు మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య


సుబ్రహ్మణ్యం

వాల్మీకిపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం చొక్కాండ్లపల్లె పంచాయతీ కనగాని గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం(45) తన భార్య కాపురానికి రాలేదని మనస్థాపం చెంది సోమవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మదనపల్లెలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలి

● ఆదర్శ పాఠశాలల ఏఏఎంవో పీవీఎస్ కుమార్


విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఏఎంవో పీవీఎస్ కుమార్

ములకలచెరువు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని ఆదర్శ పాఠశాలల అసిస్టెంట్ అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ పీవీఎస్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఆదర్శ పాఠశాల, కళాశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే కష్టపడి పనిచేయాలన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకోవాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి పని చేయాలన్నారు. అనంతరం టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఇన్‌టైమ్, అవుట్ టైమ్ హాజరు, విద్యార్థుల హాజరు, తరగతి గదులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై విద్యాశక్తి క్లాసుల పనితీరు, ఎంసెట్, జెఈఈ, నీట్ తరగతుల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని కూడా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కవిత పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవం


శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని గ్రామోత్సవం

పెనగలూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వడ్డిపాలెం వేంకటేశ్వరాలయం వార్షికోత్సవం సందర్భంగా మంగళ వారం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి తురక వెంకటరమణ, వెంకట సుబ్బమ్మ దంపతుల ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. అంతకంటే ముందు కుంచాల నరసింహులు, లక్షుమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీవారి మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలు, సువాసన పూలతో ఘనంగా అభిషేక కార్యక్రమం జరిగింది. తురక వెంకటయ్య, రమణమ్మ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. కుంచాల చిన్న వెంకటసుబ్బయ్య, యానాదమ్మల దంపతుల సహకారంతో గ్రామసభలో నెల్లూరు కళాకారులచే అద్భుతమైన కోలాట ప్రదర్శన జరిగింది. గ్రామసభలో భక్తులకు తురక కుమార్, వెంకటలక్షుమ్మ కుటుంబ సభ్యులు బూంది ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వహణ కార్యకర్తలు కుంచాల వేణు, బత్తల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు వరం..పీఎంఈజీపీ

● 343 యూనిట్లకు...
253 యూనిట్లు పూర్తి

● డెయిరీ ఫాం, పవర్‌లూమ్స్, వర్క్‌షాప్‌లకు అధిక ప్రాధాన్యత

● జిల్లాలో డెయిరీ ఫామ్‌పై 60-70 శాతం యువత మొగ్గు



జిల్లా పరిశ్రమలశాఖ కార్యాలయం

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ) ప్రవేశ పెట్టింది. ప్రస్తుతం ఈ పథకం నిరుద్యోగులకు వరంలా మారింది. రాయల సీమలో అన్నమయ్య జిల్లా కరువు ప్రాంతానికి పెట్టింది పేరు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే తప్ప నిరుద్యోగ యువత వలసలకు అడ్డుకట్ట వేయలేమనే వాదన ఒకప్పుడు బలంగా ఉండేది. అయితే ఇక్కడ చదువుకుని ఉద్యోగాలు లేక నిరుద్యోగులు కువైత్, సౌదీ ప్రాంతాలకు వెళ్లి నానా ఇబ్బందులు పడుతూ.. ఇక్కడ కుటుంబాలను పోషిస్తున్న పరిస్థితి గత 30 ఏళ్లుగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో మదనపల్లె డివిజన్‌లోని యువత ఎక్కువగా పాడి పరిశ్రమ, పవర్‌లూమ్స్, వర్క్‌షాప్‌పై మొగ్గుచూపుతున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా 343 యూనిట్లకు గానూ 252 యూనిట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం దాదాపు రూ.884 లక్షలు బ్యాంకుల ద్వారా నిరుద్యోగ యువతీ, యువకులకు అందించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. రాజంపేట, రాయచోటి డివిజన్‌లో టైలరింగ్, జిరాక్స్, బ్యూటీపార్లర్, వర్క్‌షాపుల పైన యువతీ యువకులు ఎక్కువ మొగ్గుచూపుతున్నారని తెలుస్తుంది.

ఈ నేపథ్యంలో పీఎంఈజీపీ ద్వారా నిరుద్యోగ యువతకు 2025-26 ఏడాదికి మొత్తం 135 యూనిట్లకు గాను రూ.324 లక్షలు ఇవ్వడానికి అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రాంతంలో చదువుకున్న యువతీ యువకులు సాఫ్ట్‌వేర్ వైపు మొగ్గు చూపి కొంత మంది ముంబై, చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో కొంతకాలం పనిచేసి తిరిగి వారి ప్రాంతాలకు వచ్చి వ్యవసాయం, పాడిపరిశ్రమ పైన ఎక్కువ శ్రద్ధ పెడుతున్నారని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో మదన పల్లె డివిజన్‌లో యువ సాఫ్ట్‌వేర్ తన ఉద్యోగం వదిలేసి పాడి పరిశ్రమలు ఏర్పాటు చేసి దాదాపు నెలకు రెండు లక్షలు సంపాదిస్తున్నాడని జిల్లా పరిశ్రమలశాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే రామాపురంలో ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన ఉద్యోగం వదిలేసి డ్రాగన్ ఫ్రూట్స్ వేసి రూ.20 లక్షలు సంపాదించాడని ఏడాది క్రితం పత్రికల్లో ఒక కథనం వచ్చింది. ఇలా నిరుద్యోగ యువతీ, యువకులను ఆదుకుంటూ వారికి చేదోడు వాదోడుగా జిల్లా పరిశ్రమలశాఖ ఉందని కొంత మంది నిరుద్యోగులే చెప్పుకొస్తున్నారు.

జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ఏమన్నారంటే..

ఈ విషయంపై జిల్లా పరిశ్రమలశాఖ అధికారి కృష్ణకిశోర్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. జిల్లాలో యువతీ యువకులు ఇతర దేశాలకు, ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని నిరుద్యోగులను ఆకర్షించే విధంగా కొన్ని కార్యక్రమాలు చేస్తున్నాం. అందులో భాగంగా మొదటగా పాలడెయిరీ ఫామ్‌లను యువత ఆకర్షిస్తున్నారు. తర్వాత పవర్‌లూమ్స్ కూడా లోన్స్‌తో పాటు చిన్న చిన్న కుటీర పరిశ్రమలకు సంబంధించిన లోన్స్ చేస్తున్నాం. కొందరు సాఫ్ట్‌వేర్ వైపు వెళ్లిన యువత తిరిగి వచ్చి వారి ప్రాంతంలో డైరీ ఫామ్ ఏర్పాటు చేసుకోవడం, వ్యవసాయం వైపు వెళ్లడం చేస్తున్నారు. వారికి తాము లోన్స్ ఇచ్చే ప్రయత్నాలు కూడా చేస్తున్నాం.

జైలు సిబ్బందిపై చర్యలు

● ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ సహా మరో ఇద్దరికి చార్జ్ మెమోలు

ప్రొద్దుటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు సబ్ జైలు నుంచి ఆగస్టు 16న రిమాండ్ ఖైదీ మహ్మద్‌రఫీ పరారీలో జైలు సిబ్బంది నిర్లక్ష్యంపై జిల్లా సబ్ జైళ్ల అధికారి అమర్‌బాషా చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు ఇన్‌చార్జ్ జైలు సూపరింటెండెంట్‌గా ఉన్న శ్రీనివాసరావుతో పాటు మరో ఇద్దరి కానిస్టేబుళ్లకు చార్జ్ మెమోలు జారీ చేశారు. రిమాండ్ ఖైదీ జైలు గోడలు దూకి పరారవ్వడంలో జైలులో వున్న భద్రత ప్రమాణాలపై కూడా చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా జైలు గోడలు ఎత్తుతో పాటు గోడలు ఎక్కేందుకు ఎక్కడెక్కడ వీలుందో పరిశీలించారు. అలాగే జైలు గోడలపై వేసిన ఇనుప కంచెలో మనుషులు దూరెంత సందు ఉండటం, తీగలకు విద్యుత్ ఉన్నా పరారవ్వడంపై లోతుగా ఆరాతీస్తున్నారు.

రిమాండ్‌కు తరలింపు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): చిప్పిలి వద్ద దాడి చేసి ఇద్దరిని గాయపర్చిన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు ఇటీవల సోషియల్ మీడియాల్లో పోస్టు పెట్టారనే కారణంతో పెద్దమండ్యం అవేకే నాయక్ తాండా సర్పంచ్ నటరాజ నాయక్, సాగర్లపై దాడి చేసి గాయపర్చారు. ఈ కేసులో శివశంకర్, కార్తీక్ రెడ్డి, హరీష్, శ్రీకాంత్‌రెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నూతన బార్ పాలసీపై అవగాహన అవసరం

● ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజ్

రాయచోటిటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నూతన బార్ పాలసీపై అవగాహన అవసరమని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ తెలిపారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన బార్ పాలసీలోని సానుకూలతలను వివరించారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని మదనపల్లెలో-5, రాజంపేటలో-2, రాయచోటిలో-3, పీలేరులో-1 చొప్పున బార్ల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల ఏర్పాటు కోసం ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు గడువు ముగిసిన అనంతరం ఈ నెల 28వ తేదీన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా బార్లు కేటాయిస్తారన్నారు. గతం కంటే ప్రస్తుతం లైసెన్స్ ఫీజు తగ్గడమే కాకుండా, బార్లు ఏర్పాటు చేసుకునే వారికి ప్రభుత్వం పలు సానుకూలతలు కల్పించిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మధుసూదన్, అసిస్టెంట్ అధికారి జోగేంద్ర, జిల్లాలోని ఎక్సైజ్ సీఐలు, లైసెన్స్‌దారులు, మద్యం షాపుల లైసెన్సీలు పాల్గొన్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరించుకుందాం

● ఏపీజీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డీ.లక్ష్మిప్రసాద్


సమస్యలపై చర్చిస్తున్న డాక్టర్ లక్ష్మిప్రసాద్

రాయచోటిటౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే 'టీ తాగుతూ చర్చించుకుందాం' అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మిప్రసాద్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమానికి హాజరైన వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సత్యనారాయణ నూతనంగా టీ తాగుతూ చర్చించుకుందాం అనే కార్యక్రమాన్ని ప్రారంభించార న్నారు. రాష్ట్రంలోని ఉద్యోగస్తులకు పీఆర్‌సీ అరియర్, డీఏ అరియర్, అలాగే 3 సంవత్సరాల సరెండర్ లీవ్స్ అరియర్స్ పెండింగ్ ఉన్నాయన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకతతో తాము ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతోనే సానుకూలంగా రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమం ద్వారా ఉద్యోగుల సమస్యలను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలాజీ, రాయచోటి తాలూకా అధ్యక్షుడు సాయికుమార్, కార్యదర్శి సుజిత్‌డాల్, పెన్షనర్ సంఘం అధ్యక్షుడు రాజా, సభ్యులు తిరుపతి శ్రీనివాసులు, అధ్యాపకులు మడితాటి నరసింహారెడ్డి, గిరిబాబుయాదవ్, మోహన్ నాయక్, శివభాస్కర్, రెడ్డెప్పరెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

పగలు బొగ్గులు.. రాత్రి దోపిడీలు

● పాణ్యం ముఠాకు రాయచోటి వ్యక్తి సాయం

● చెక్కవారిపల్లి నుంచి నెలకు సరిపడా సరుకులు

తనకల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలంలోని చెక్కవారిపల్లి అటవీ ప్రాంతంలో సోమవారం పట్టుబడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా వ్యవహారం కలకలం రేపుతోంది. అటవీ ప్రాంతంలో ఈ ముఠా ఆరు నెలలుగా గుడారాలు వేసుకుని ఉంటోంది. తనకల్లు, కదిరి రూరల్, పాణ్యం పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేసి వీరిని పట్టుకున్నారు. వారి కదలికలను గుర్తించేందుకు డ్రోన్‌ల నిఘా పెట్టారు. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన శేఖర్ అనే వ్యక్తి ద్వారా వీరు తనకల్లు మండలంలోని దిగువ చెక్కవారిపల్లికి చేరినట్లు సమాచారం. అక్కడి నుంచి నెల క్రితం అటవీప్రాంతానికి మకాం మర్చారు. వీరందరూ నంబులపూలకుంట మండలం పెడబల్లి వద్ద బొగ్గులు కాల్చే పనికి వెళ్లేవారు. వీరికి చెక్కవారిపల్లికి చెందిన ఓ వ్యక్తి ద్వారా ప్రతి నెలా తినడానికి కావలసిన సరుకులు వెళ్లేవని సమాచారం. రాయచోటికి చెందిన శేఖర్‌కు చెక్కవారిపల్లికి చెందిన ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. అతని ద్వారానే శేఖర్ దొంగల ముఠాకు సాయం అందించాడని సమాచారం. పగటిపూట బొగ్గులు కాల్చి, రాత్రిళ్లు దోపిడీలకు పాల్పడేవారని సమాచారం.

ఏజీ గార్డైన్ కాలనీ ఎవరిది...?

● గ్రామ పంచాయతీదా..
మున్సిపాలిటీదా...

● సిమెంటు రోడ్డు, తాగునీరు లేక ఇక్కట్లు



తమ గోడును వెళ్లబోసుకుంటున్న కాలనీవాసులు, (ఇన్‌సెట్లో) ట్యాంకర్ ద్వారా నీటిని కొనుగోలు చేసుకుంటున్న దృశ్యం

రాయచోటిటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న ఏజీ గార్డెన్ కాలనీలో 100 కుటుంబాలకు పైగా అన్ని వర్గాల ప్రజలు నివసిస్తున్నారు. 2009-10 ప్రాంతంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద ఆ కాలనీలో ఇండ్లు లేని పేదలకు ఇంటి పట్టాలిచ్చి గృహాలు నిర్మించారు. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో పాటు లబ్ధిదారులు సొంతంగా కొంత ఖర్చు చేసుకొని ఇళ్లను నిర్మించుకున్నారు. సుమారు 150కి పైగా వివిధ వర్గాలకు చెందిన పేదలు రాయచోటి పట్టణంలో ఇంటి బాడుగలు కట్టలేక ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో కొంత మంది ఇండ్ల నిర్మాణం చేపట్టి నివాసముంటుండగా, మరి కొంత మంది ఆర్థిక స్థోమత లేక అలాగే వదిలేశారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గృహ నిర్మాణశాఖ ద్వారా ఇండ్ల నిర్మాణానికి బిల్లులు చెల్లించడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించి వదిలేశారు. అప్పటి నుంచి కనీస మౌలిక వసతులు లేక ఏజీ గార్డెన్ కాలనీ వాసులు దినదినగండంగా కాలం వెల్లబుచ్చుతున్నారు. ప్రస్తుతం వారి నివసిస్తున్న ఏజీ గార్డెన్ కాలనీకి పక్కనే గల మరో ఇందిరమ్మ కాలనీకి వెలిగల్లు నీటి పథకం నుంచి తాగు నీటి పైపులైను ఏర్పాటు చేసి నీటిని అందిస్తున్న మున్సిపల్ అధికారులు కాలనీకి మాత్రం నీరు ఇవ్వకపోవడం ఆశ్చర్యం. ప్రతి కుటుంబం వారానికి ఒక నీటి ట్యాంకును కొనుగోలు చేయక తప్పడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే ఒకరి మీద ఒకరు పెట్టుకుని కాలయాపన చేయడం పరిపాటిగా మారింది.

ఈ కాలనీ ఎవరి పరిధిలోకి ?

రాయచోటి పట్టణ పరిధిలోని మదనపల్లె రోడ్డులో గల ఏజీ గార్డెన్ ఇందిరమ్మ కాలనీ ఎవరి పరిధిలోకి వస్తుందో ఇప్పటికీ క్లారిటీ లేదు. సుమారు 15 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఇందిరమ్మ పథకం కింద గృహ నిర్మాణశాఖ వారు రాయచోటి పట్టణంలో అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్న పలువురు పేదలకు ఏజీ గార్డెన్ కాలనీలో ఇంటి పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు.

తాగునీరు అసలే లేదు

సుమారు 100 కుటుంబాలకు పైగా నివసిస్తున్న ఈ కాలనీలో నేటికీ అక్కడ సిమెంటు రోడ్లు లేకపోవడం, తాగునీరు అసలే లేకపోవడం చూస్తే వారు పట్టణంలో ఉన్నారా లేక మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్నారా అనే సందేహం కలుగకమానదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని రోడ్ల సమస్య, తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

ఆకేపాటి రిసెప్షన్‌కు వైసీపీ అధినేత


ఆకేపాడులో నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాజంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి కుమారుడు రిసెప్షన్‌కు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం హాజరయ్యారు. బెంగుళూరు నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆకేపాడుకు వచ్చి ఆకేపాటి అనురాగరెడ్డి, వరదీక్షితరెడ్డి దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, కడప కార్పొరేషన్ చైర్మన్ సురేష్ బాబు, జడ్పీ మాజీచైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, అన్నమాచార్య యూనివర్శిటీ అధినేత చొప్పా గంగిరెడ్డి, వైసీపీ రాజంపేట ఇన్‌చార్జి ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలికారు.

రీసర్వే పారదర్శకంగా నిర్వహించండి

● సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి


రీసర్వే పనుల గురించి ఆరా తీస్తున్న సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి

మదనపల్లెటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి తెలిపారు. మంగళవారం మదనపల్లె మండలం పోతబోలు గ్రామంలో రీసర్వేను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సర్వే నెంబర్‌లోని భూములు, రికార్డులకు అనుగుణంగా సర్వే చేయాలన్నారు. సర్వే సమయంలో సంబంధిత రైతులకు సమాచారం ఇచ్చి వారి సమక్షంలో సర్వే చేస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు. రీసర్వేలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటే రైతులు మళ్లీ మళ్లీ రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో డీఐ వెంకటరమణ నాయుడు, సర్వేయర్ సుబ్రహ్మణ్యం, రీసర్వే డీటీ మౌలా, వీఆర్‌వో నారాయణ, పోతబోలు మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్‌ఖాన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రతి రోజూ చెత్త సేకరించాలి

● జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి

ఒంటిమిట్ట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతిరోజు చెత్త సేకరించాలని జిల్లా పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి ఆదేశించారు. మంగళవారం మండలంలోని పెన్నపేరూరు, గంగపేరూరు గ్రామాల్లో సౌమిత్వ ఐవీఆర్ఎస్ అమలు పరిస్థితిపై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలని అందుకు అవసరమైన కూలీలు వాహనాలు, డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే అక్కడి ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. సౌమిత్వ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిని కొలిచి, దాని ఆధారంగా ప్రాపర్టీ కార్డును మంజూరు చేయాలన్నారు. గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రజలు కూడా బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రసాద్, గంగపేరూరు పంచాయతీ కార్యదర్శి సౌజన్య, సాలాబాదు పంచాయతి కార్యద్శి చంద్ర తదితరులు పాల్గన్నారు.


సౌమిత్వ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న డీపీవో

8 మంది సీఐల బదిలీ

కడప క్రైం ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో పని చేస్తున్న 8మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కడప వీఆర్‌లో ఉన్న జి.సుబ్బారావును కడప టూటౌన్ పీఎస్‌కు, ఎన్.క్రిష్ణయ్యను బద్వేల్ రూరల్ సర్కిల్‌కు బదిలీ చేశారు. బద్వేలు సర్కిల్ నుంచి ఎం.నాగభూషణ్‌ను సీకే దిన్నెకు, ఇక్కడున్న ఎస్‌డీ శివశంకర్ నాయక్ కడప ఎస్బీ-2కు బదిలీ అయ్యారు. ఎస్బీ-2 నుంచి డి.భాస్కర్ రెడ్డి ఎస్బీ-1కు ఇక్కడున్న ఆర్.పురుషోత్తం రాజు కడప ఎస్సీ/ఎస్టీసెల్‌కు, ఇక్కడున్న వి.వేణుగోపాల్ ప్రొద్దుటూరు త్రీటౌన్‌కు, ఇక్కడి నుంచి ఏ.గోవిందరెడ్డి కడప వీఆర్‌కు బదిలీ అయ్యారు.

అంగన్వాడీ కేంద్రంలో సిబ్బంది మధ్య గొడవ

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని మాసాపేట సెక్టారులో ఉన్న సున్నపురాళ్ల మిట్ట 1 అంగన్వాడీ కేంద్రంలో సిబ్బంది గొడవ పడినట్లు తెలుస్తోంది. ఐదురోజుల క్రితం అంగన్వాడీ టీచరు, ఆయా గొడవ పడినట్లు సమాచారం. ఇరువురు పోలీసు స్టేషన్‌కు కూడా వెళ్లినట్లు తెలుస్తుంది. కాగా, ఈవిషయంపై సీడీపీవో విచారణ చేపట్టి ప్రాజెక్టు డైరెక్టరుకు నివేదించారు. ఈ మేరకు మంగళవారం పీడీ కేంద్రానికి వచ్చి ఇరువురితో సంఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ సిబ్బంది గొడవపడ్డారనే విషయంపై విచారణ చేపట్టామన్నారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నట్లు చెబుతున్నారని... ఇందుకు సంబంధించి ఎటువంటి సాక్ష్యాధారాలు లేవని వివరించారు. ప్రస్తుతం అక్కడ ఉన్న కేంద్రాన్ని మరో చోటకు తరలించినటట్లు ఆమె తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

కమలాపురం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని మీరాపురంలో మంగళవారం ఉదయం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామంలో కనిపించిన వారిపై దాడి చేసింది. ఈ దాడిలో గ్రామానికి చెందిన సుబ్బమ్మ, అరుణ, సుబ్బరాయుడుకు గాయాలయ్యాయి. వీరిని కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

పంట నష్టం చేశారని కేసు నమోదు

కలసపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నపల్లెలో పంట నష్టం చేశారని ఎక్కలూరు శ్రీనివాసులుపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. గ్రామానికి చెందిన అంకయ్య మరికొందరు సాగు చేసిన సజ్జ పంటను శ్రీనివాసులు ట్రాక్టర్‌తో తొక్కించుకొని వెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపుతప్పి కారు బోల్తా

● ఇద్దరికి స్వల్ప గాయాలు

కొండాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంజిఅనంతపురం గ్రామం వద్ద చిత్రావతి బ్రిడ్జి సమీపంలో మంగళవారం కారు అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికుల సమాచారం మేరకు కారు ప్రొద్దుటూరు నుంచి కళ్యాణదుర్గం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. కారులో నలుగురు ప్రయాణిస్తుండగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

బీ.. కేర్‌ఫుల్

మేల్కోకపోతే ముప్పు తప్పదు

ప్రమాద ఘంటికలు మోగిస్తున్న వంతెనలు

ఆందోళనలో ప్రజలు



పిల్లర్లు దెబ్బతిని అధ్వాన్నస్థితిలో ఉన్న సగిలేరు వంతెన

సగిలేరు వంతెనపై...

కలసపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ కాలంలో కలసపాడు వద్ద సగిలేరుపై నిర్మించిన బ్రిడ్జి ప్రస్తుతం ప్రమాదఘంటికలు మోగిస్తోంది. ఈ వంతెన అధ్వాన్నస్థితికి చేరుకున్న పట్టించుకునేవారే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. ఈ వంతెనకు సంబంధించిన పిల్లర్లు అప్పట్లో రాళ్లతో నిర్మిచారు. స్లాబ్ మాత్రం కాంక్రీట్‌తో ఏర్పాటు చేశారు. పోరుమామిళ్ల-గిద్దలూరు ప్రధాన రహదారిలోని కలసపాడు వద్ద సగిలేరుపై నిర్మించిన ఈ వంతెనపై నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ప్రైవేట్, ఆర్టీసీ బస్సులతో పాటు భారీ బరువుతో కూడిన ఇనుము, ఇసుక, కంకర, ధాన్యం బస్తాలతో లారీలు ఈ వంతెనపై వెళ్తుంటాయి. 1996లో వచ్చిన వరదకు వంతనపై పది అడుగుల మేర నీరు ప్రవహించింది. వరద దాటికి కొన్ని పిల్లర్లు దెబ్బతినడంతో సంబంధిత అధికారులు తాత్కాలికంగా మరమ్మత్తులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. 2020లో కూడా వంతెన పైనుంచి నీరు ప్రవహించింది. ప్రస్తుతం వంతెనపై గుంతలు ఏర్పడటంతో వర్షం వచ్చినపుడు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాతితో నిర్మించిన పిల్లర్లకు నెర్రెలు ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణీకులు, ప్రజలు ఆందోళనలకు గురవుతున్నారు. చిన్నచిన్న రహదారిపై కోట్ల రూపాయలతో వంతెనలు నిర్మిస్తున్న రహదారులు, భవనాలశాఖ అధికారులు ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఈ ప్రధాన రహదారిపై నూతన వంతెన నిర్మాణంపై శ్రద్ధ చూపకపోవడం పట్ల ఈ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కుందూ బ్రిడ్జిపై...

చాపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం గ్రామం వద్ద కుందూ నదిపై నిర్మించిన బ్రిడ్జిపై ప్రమాదం పొంచి ఉంది. ఈ వంతెనను 1927లో బ్రిటీష్‌వారు నిర్మించారు. బ్రిడ్జిపై ప్రతి రోజు వందల సంఖ్యలో వాహనాలు తిరుగు తుంటాయి. అల్లాడుపల్లె, పెద్దగురువలూరు, సీతారామపురం, చిన్నగురవలూరు, మరో ఎనిమిది గ్రామాల ప్రజలు ఈ బ్రిడ్జి గుండా ప్రొద్దుటూరు, మైదుకూరు పట్టణాలకు వెళుతుంటారు. పొలాల్లో పండించిన పంట ఉత్పత్తులను కూడా రైతులు ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో ఇళ్లకు తీసుకుపోతుంటారు. అల్లాడుపల్లె వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు కూడా ప్రొద్దుటూరు నుంచి భక్తులు వస్తుంటారు. కాగా, గత రెండు వారాల నుంచి నదిలో సుమారు 20 అడుగుల లోతు నీళ్ల ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో బ్రిడ్జిపై నీళ్ల పొర్లి ప్రవహించే అవకాశం ఉంది. ఇప్పటికే వంతెన పిల్లర్లలో ఒకటి దెబ్బతినగా.. అధికారులు తాత్కాలిక మరమ్మత్తులు చేసి చేతులు దులుపుకున్నారు. ఇక వంతనపై రక్షణగా ఏర్పాటు చేసిన సిమెంటు దిమ్మెలు దెబ్బతిన్నాయి. దీంతో బ్రిడ్జిపై రాకపోకలు సాగించే సమయంలో ఎప్పుడు ఏం ప్రమాదం సంభవిస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి హైలెవల్ వంతెన నిర్మించాలని కోరుతున్నారు.



సీతారామపురం గ్రామం వద్ద ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

సుస్థిర జీవనోపాధులపై ప్రణాళికలు రూపొందించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామా ల్లో సుస్థిర జీవనోపాధి, ఆర్థిక అభివృద్ధి సాధనకు స్వయం సహాయక సంఘాలను, రైతు ఉత్పత్తి సంస్థలను బలోపేతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో గ్రామీణాభివృద్ధి, బ్యాంకింగ్, వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అన్ని విధాల అభివృద్ధి పథంలో నడవాలంటే అన్ని ప్రాధాన్యత రంగ శాఖలు సమన్వయంతో కేటాయించిన లక్ష్యాలను అధిగ మించాలన్నారు. ముందుగా అన్ని గ్రామాల్లో సామాజిక ఆర్థిక స్థితిగతులు, అక్కడ అందుబా టులో ఉన్న వనరులను సద్వినియోగం చేసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లాలో గ్రామీ ణాభివృద్ధి సంస్థ రెండేళ్లుగా పేదరిక నిర్మూలన కోసం పాటు పడుతోందన్నారు. 26,965 స్వయం సహాయక సంఘాల ద్వారా 2.62 లక్షల మంది మహిళలు ఆర్థికంగా లబ్ధి పొందుతున్నార న్నారు. అధిక శాతం వ్యవ సాయ రంగ అనుబంధ రంగాల్లో ఉపాధి పొందుతున్నారని తెలిపారు. కార్యక్ర మంలో డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి గ్రామాల్లో సుస్థిర జీవనోపాధి కల్పనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో బ్యాంకు అధికారులు, వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అదృశ్యమైన నాగేశ్వరరావు ఆచూకీ నిగ్గుతేల్చాలి

● నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహరావు



మాట్లాడుతున్న నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహరావు

కడప మారుతీనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లకు చెందిన గుర్రం శ్రీనివాసరావు అనే వ్యక్తితో కలిసి దాదాపు 17 ఎకరాలలో జామ పంటను సాగు చేసి తీరా పంట చేతికి వచ్చే సమయంలో కనిపించ కుండా పోయిన బాపట్ల జిల్లా బట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామ నాయీబ్రాహ్మణ కులానికి చెందిన మోపిదేవి నాగేశ్వరరావు ఆచూకీని ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం నిగ్గుతేల్చాలని నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరుమామిళ్లలోని పులివీడు గ్రామానికిచెందిన ఖాజాపీర్ దగ్గర నుండి 17 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని గుర్రం శ్రీనివాసరావుతో కలిసి నాగేశ్వరరావు పంట సాగు చేశారన్నారు. మూడేళ్లుగా పంట సాగుచేసి తీరా పంట చేతికివచ్చే సమయంలో గత ఏప్రిల్ 7వ తేదీ నుంచి నాగేశ్వరరావు కనిపించకుండా పోయారన్నారు. ఈ విషయంపై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. తదనంతరం నాగేశ్వరరావు భార్య నవ్యశ్రీ మాట్లాడుతూ తన భర్త కనిపించకుండా పోవడానికి ప్రధాన కారకుడు గుర్రం శ్రీనివాసరావు అని ఆరోపించారు. జామ పంట సాగుకు దాదాపు రూ.13 లక్షలు ఖర్చు చేయగా కౌలు నిమిత్తం ఖాజాపీర్‌కు రూ.7 లక్షలు చెల్లించినట్లు వెల్లడించారు. డబ్బులతో పాటు భర్త కనిపించకపోవడంతో ఇద్దరు పిల్లలతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు త్వరితగతిన స్పందించి నా భర్త ఆచూకీ తెలపాలని కోరారు.

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి రూ.2.5 లక్షల ఆర్థిక సాయం



హెడ్‌కానిస్టేబుల్ భార్య జయలక్ష్మికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన హెడ్‌కానిస్టేబుల్ ఎం.నాగార్జునరెడ్డి (హెచ్‌సీ 1071) కుటుం బానికి ఎస్పీ అశోక్‌కుమార్ రూ.2.5 లక్షల ఆర్థికసాయం అందించారు. పోలీసు సంక్షేమంలో భాగంగా పోలీసు వితరణ నిధి నుంచి ఈ మొత్తాన్ని మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హెడ్‌కానిస్టేబుల్ సతీమణి ఎం.జయలక్ష్మికి అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ హెడ్ కానిస్టేబుల్ కుటుంబ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసుశాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన) కె.ప్రకాశ్ బాబు, ఏవో కె.వెంకటరమణ, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్ పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు కేటాయించాలి

● జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం విడుదల చేసే నిధులు కీలకంగా మారుతాయని త్వరలో వాటిని విడుదల చేయాలని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం అమరావతిలోని ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ కార్యాలయ ప్రత్యేక ఓఎస్‌డీ కె.వెంకటకృష్ణను కలిసి ఆయన ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన సర్‌చార్జిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కడపజిల్లాలో కూడ నుంచి గత 22 నెలలుగా కొత్తపల్లె పంచాయతీకి, జిల్లాలోని ఇతర పంచాయతీలకు రావాల్సిన నిధులను విడుదల చేయాలని పేర్కొన్నారు. అలాగే 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. దీంతో ఓఎస్‌డీ సానుకూలంగా స్పందిస్తూ ఉపముఖ్యమంత్రితో చర్చించి వీలైనంత త్వరగా పంచాయతీలకు నిధులను విడుదలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని శివచంద్రారెడ్డి తెలిపారు.

వైవీయూ క్యాంపస్ కళాశాలలో డిగ్రీకోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని పోస్టు గ్రాడ్యుయేషన్ కళాశాలలో పలు కోర్సులలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు విశ్వవిద్యాలయ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్ వెల్లడించారు. నాలుగేళ్ల హానర్స్ కోర్సులైన బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ కోర్సులు, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులైన బయో టెక్నాలజీ అండ్ బయో ఇన్‌ఫర్మేటిక్స్, అప్లైడ్ జియాలజీ కోర్సులలో అడ్మిషన్లు ఉంటాయ న్నారు. ఈ కోర్సులలో చేరడానికి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత చాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్ అడ్మిషన్ మాడ్యుల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఓఎఎండీసీ) సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పరిశోధన, అకడమిక్‌లో అపారమైన అనుభవం గల అధ్యాపకులచే ప్రయోగ, పరిశీలనాత్మక విద్యాబోధన ఆధునిక విధానంలో ఉంటుందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం అనుసరించి విద్యాబోధన, సెమినార్లు, సింపోజిఎంలు, వర్క్‌షాపుల ద్వారా విస్తృత జ్ఞానం పొందే అవకాశం ఉంటుందన్నారు. క్యాంపస్ డ్రైవ్ ద్వారా ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. బాల బాలికలకు వేర్వేరుగా వసతిగృహాలు ఉన్నాయని తెలిపారు.

ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో పరీక్ష ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ప్లానింగ్, ఫైన్ ఆర్ట్స్ విభాగాలకు సంబంధించి 2,4,6వ సెమిస్టర్ రెగ్యులర్ ఫలి తాలను వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.విశ్వనాథకుమార్ మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో వర్సిటీ అదనపు పరీక్షల నియం త్రణాధికారి డాక్టర్ జి.ఫణీంద్రరెడ్డి, సహాయ పరీక్షల నియంత్రణాధికారి ఉదయ ప్రకాష్‌రెడ్డి, నారపరెడ్డి పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ పోటీల్లో విద్యార్థులకు బహుమతులు

పీలేరురూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో అన్ని సామాజిక వర్గాల ప్రజల జీవితాలను ప్రతిబింబించ గలిగే ప్రముఖ సాధనం ఫొటోగ్రఫీ అని వివరించారు. ఫొటో జర్నలిజానికి మంచి అవకాశాలు ఉన్నాయని, విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి ఫొటో గ్రఫీ, లఘు చిత్రపోటీలు ఉపయోగ పడతాయన్నారు. అవకాశాలను విద్యా ర్థులు తమ ఉజ్వల భవిత కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఫొటోగ్రఫీ, లఘుచిత్ర పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన మదనపల్లె మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రేమలత మొదటి బహుమతి, వాల్మీకిపురం కళాశాల విద్యార్థి మధుసూదన్ ద్వితీయ బహుమతి, కలికిరి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని కుష్బూ తృతీయ బహుమతి కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల డీఆర్సీ సమన్వయకర్త డాక్టర్ కె.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశల.. ఖరీఫ్

● పుంజుకుంటున్న పంటల సాగు
● ఊపిరి పోసిన వరుణుడు
● వారం రోజులుగా వర్షాలు
● 15,748 హెక్టార్లలో పంటలు
● 20.33 శాతానికి చేరిన సాగు



దేవుని కడప చెరువు కింద వరినాట్లు వేస్తున్న కూలీలు

కడప రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ఆశలు చిగురిస్తున్నాయి. నిన్నటివరకు మందకొడిగా సాగిన ఖరీఫ్ ఇప్పుడు నెమ్మదిగా పుంజుకుంటోంది. గత వారం రోజుల నుంచి జిల్లాలో ఆశాజనకంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో ఖరీఫ్ సాగులో కదలిక వచ్చింది. జూన్ మొదటి వారంలో సీజన్ ప్రారంభమైంది. అంతకు మునుపు మే నెల చివరిలో పదును వర్షాలు పడ్డాయి. ఈ వర్షాలకు కొందరు రైతులు ఖరీఫ్‌లో భాగంగా అక్కడక్కడ వేరుశనగ, పత్తి, కంది, మినుము తదితర పంటలను సాగుచేశారు. ఆ తరువాత ఆగస్టు నెల మొదటి వారం వరకు దాదాపు రెండు నెలలు పైబడి వర్షాభావం వెంటాడడంతో ఖరీఫ్ సాగు మందకొడిగా సాగింది. దీంతో 77,475 హెక్టార్ల సాగుకు గాను జూలై 3 నాటికి కేవలం 2565 హెక్టార్లు మాత్రమే (3.31 శాతమే) సాగైంది. ఈ నేపధ్యంలో గత వారం రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా ఆశాజనకంగా వర్షాలు పడుతుడటంతో ఖరీఫ్ పంటల సాగు గణనీయంగా పెరుగుతోంది. గురువారం నాటికి 15,748 హెక్టార్లలో (20.33 శాతం) పంటలు సాగుకు నోచుకున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తెరపి ఇవ్వగానే ఖరీఫ్ సాగు మరింత జోరందుకోనుంది. దీంతో సాగు లక్ష్యాన్ని సాధించేందుకు వ్యవసాయశాఖ అధికారులు వడివడిగా అడుగులు వేస్తున్నారు.

వర్షాలతో మెట్టపంటలకు ప్రాణం

తీవ్ర వర్షాభావ పరిస్థితులు, అడుగంటిన భూగర్భజలాలు, నిండని జలాశయాలు ఇలాంటి విపత్కర పరిస్థితుల నుంచి జిల్లా రైతాంగం క్రమంగా బయటపడుతోంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో మెట్టపంటలకు ప్రాణం పోసినట్లయింది. మరోవైపు పెన్నా, కేసీ కెనాల్‌కు ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం ఉండడంతో ఆయకట్టుకు నీటి విడుదల పెరిగింది. దీంతో వరినాట్లు జోరందుకున్నాయి. అలాగే జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతాంగంలో ఆశలు చిగురించేలా చేస్తున్నాయి. ఖరీఫ్ ప్రారంభం నుంచి ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో జిల్లా రైతాంగానికి ఎదురుచూపులు తప్పలేదు. వారం రోజులనుంచి కురుస్తున్న వర్షాలతో చేతికి రాకుం డా పోతాయని భావించిన మెట్టపంటలకు సైతం ప్రాణం పోసినట్లయింది. పత్తి, వేరుశనగ, కంది, మినుము, పెసర పంటలకు ఊపిరి వస్తోంది.

15,748 హెక్టార్లలో పంటలు

జిల్లాలోని సాగు విస్తీర్ణంలో అత్యధిక భూభాగం వర్షాధారంపై ఆధారపడింది. ఇందులో ఖరీఫ్ సీజన్ ప్రథమ ప్రాధాన్యతగా వస్తోంది. జిల్లాలో 2025 ఖరీఫ్‌కు గాను సాధారణ విస్తీర్ణం కింద 77,475 హెక్టార్లు సాగు లక్ష్యంగా అధికారులు నిర్ధారించారు. ఇప్పటి వరకు ఖరీఫ్ మధ్యస్థానికి వచ్చింది.
గురువారం నాటికి అన్ని రకాల పంటలను కలుపుకుని 15,748 హెక్టార్లలో సాగుకు నోచుకున్నా యి. వీటిలో ప్రధానమైన వరి పంట 30,804 హెక్టార్లకు గాను 6568 హెక్టార్లలో, మొక్కజొన్న 932 హెక్టార్లకు 1772 హెక్టార్లలో, కంది 5761 హెక్టార్లకు 285 హెక్టార్లలో, మినుము పంట 3806 హెక్టార్లకు 1502 హెక్టార్లలో, పత్తి పంట 24,036 హెక్టార్లకు 3524 హెక్టార్లలో, వేరుశనగ 5,976 హెక్టార్లకు 983.88 హెక్టార్లలో, సన్‌ఫ్లవర్ 1142 హెక్టార్లకు 225 హెక్టార్లలో, ఇతర పంటలు ఆయా హెక్టార్లలో వెరసి ఇప్పటి వరకు 20.33 శాతం మేర సాగుకు నోచుకున్నాయి.

పారిశుధ్య పనులపై శ్రద్ధ వహించండి : డీపీఓ



కార్యదర్శులకు సూచనలిస్తున్న డీపీఓ రాధమ్మ

మదనపల్లె టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనుల నిర్వహణపై శ్రద్ధ వహించాలని డీపీఓ రాధమ్మ ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తసేకరణ ఏరోజుకారోజు పూర్తి చేయాలని, సేకరించేటప్పుడు తడి, పొడి చెత్తను వేరుచేసి కంపోస్టుయార్డుకు తరలించాలన్నారు. ఎక్కువ వర్షం కురిసినప్పుడు మురుగుకాల్వల్లో చెత్త, పూడికమన్ను చేరకుండా మురుగునీటి కాల్వలను శుభ్రం చేయించాలన్నారు. తాగునీటి ట్యాంకులను నిర్దేశించిన సమయానికి క్లీన్ చేయించి, బ్లీచింగ్ చేయించాలన్నారు. వీధిలైట్ల నిర్వహణ, పంచాయతీకి రావాల్సిన పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్‌వలి, ఈఓఆర్డీ అబ్దుల్ షకూర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాండంతొలుచు పురుగు నివారణకు చర్యలు చేపట్టాలి



వరినాట్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మంజుల, తదితరులు

నిమ్మనపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వరిలో కాడంతొలచు పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని ఏఓ మంజుల పేర్కొన్నారు. మంగళవారం రెడ్డివారిపల్లి పంచాయతీలో పొలంపిలుస్తోంది కార్యక్రమానికి తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు విశ్వనాధ్, సంధ్యారాణి, కలికిరి కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు రైతులకు సూచనలు సలహాలు అందించారు. వరిలో కాడంతొలుచు పురుగు ఎక్కువగా వస్తోందని దాన్ని నివారించేందుకు క్లోరిఫెరి పాస్ 2.5 మిల్లీలీటర్లు లేకపపోతే ఎసిఫేట్ 1.5 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరినాట్ల సమయంలో రైతులు పైరును దూరంగా నాటితే కలుపు తీయడం సులభమని, పైరుకు ఎండ, గాలి బాగాసోకి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం పంటలు పండిచిన రైతులు ఈ-క్రాప్ బుకింగ్‌ను తప్పక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహయకులు, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతాయుత విధులకు విలువైన గుర్తింపు




ఏఈఈ రాజశేఖర్‌ను సన్మానిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది

వాల్మీకిపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు తమ విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే నిజమైన గుర్తింపు లభిస్తుందని ట్రాన్స్‌కో ఈఈ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వాల్మీకిపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నియోజకవర్గంలోని ట్రాన్స్‌కో అధికారుల సమక్షంలో ఉత్తమ సేవా అవార్డు గ్రహీత ఏఈఈ రాజశేఖర్‌ను సన్మానించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి విధులను బాధ్యతతో నిర్వహిస్తూ ప్రజలకు జవాబు దారీగా నిలవాలని సూచించారు. అనంతరం ఏఈఈ రాజశేఖర్‌ను సన్మానించి సత్కరించారు. ట్రాన్స్‌కో డీఈఈ శివయ్య, జేఈ జాకీర్ హుస్సేన్, లైన్‌మన్ శేషాద్రిరెడ్డి, సిబ్బంది రమణారెడ్డి, మోహన్, ప్రసాద్, రెడ్డెప్ప, గిరి, సాంబశివ, శ్రీపతి, లోకేష్, చెన్నరాయుడు, విజయకుమార్, బాలాజీ పాల్గొన్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ఇబ్బడి ముబ్బడిగా మరమ్మతు పనులు ● విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రైవేటు వారితో రైతుల పనులు ● సిబ్బందిని నియమించాలని వేడుకోలు



పెద్దతిప్పసముద్రం ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్లల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండలంలో సుమారు ఏడు వేల వ్యవసాయ కనెక్షన్లు, 16 వేల దాకా గృహ వినియోగ కనెక్షన్లు ఉన్నాయి. నాణ్యమైన విద్యుత్‌ను అందించలేక పోతున్నారు. అంతేకాకుండా సిబ్బంది కొరతతో పలు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. దీంతో రైతులు ప్రైవేటు వర్కర్లను ఆశ్రయిస్తున్నారు. అయినా డబ్బు, సమయం వృథా అవుతోందే తప్ప సమస్య తీరడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదనపు సిబ్బందిని నియమించాలని అధికారులను రైతులు వేడుకుంటున్నారు. వివరాల్లోకెళితే....

మండల పరిధిలో పెద్దతిప్పసముద్రం సహ రంగసముద్రం, మల్లెల, కందుకూరు, వరికసువపల్లె, గ్రామాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో 24 మంది విద్యుత్ సిబ్బంది ఉండాల్సి ఉంది అయితే కేవలం 9 మంది మాత్రమే ఉన్నారు. దీంతో వర్షాకాలం వచ్చిందంటే రైతుల పొలాల్లో ఏదో ఒక విద్యుత్ సమస్య తలెత్తుతోంది. ఆ సమస్యలను పరిష్కరించాలంటే తగినంత సిబ్బంది లేకపోవడంతో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. మారుమూల గ్రామాల్లో రాత్రిళ్లు విద్యుత్ సమస్యలు ఏర్పడితే చిన్నచిన్న మరమ్మతులు సైతం చేయాలన్నా ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

బోర్ల వద్ద ఫీజులు పోయినా...

రైతుల వ్యవసాయ బోర్లకు అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కనీసం ఫీజు పాడైనా అమర్చే వారు లేక రైతులే వేసుకోవాల్సి వస్తోంది. రైతులకు ప్రభుత్వం అందించే 9 గంటల విద్యుత్ రెండు విడతలుగా అందిస్తున్నారు. ఉదయం 5 గంటలు, రాత్రి వేళల్లో 4 గంటల విద్యుత్‌ను రైతులకు అందిస్తున్నారు. రాత్రివేళల్లో విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడితే వాటిని సరిచేసే సిబ్బంది లేక పోవడంతో రైతులే వాటిని సరిచూసుకోవాల్సి వస్తోంది. దీంతో గతంలో పీటీఎం మండలంలో అనేక విద్యుత్ ప్రమాదాలు సైతం చోటుచేసుకున్నాయి. రైతుల బోర్లకు విద్యుత్ సమస్యలు ఎదురైతే ప్రైవేటు మెకానిక్‌లను సంప్రదించి మరమ్మతులు చేసుకుంటే వారికి అధిక మొత్తంలో ముట్టచెప్పాల్సిన పరిస్థితి రైతుల్లో నెలకొంది.

కొత్త సర్వీసులు అమర్చాలంటే...

రైతులు బోర్లను వేసుకుని వాటికి కొత్తగా సర్వీసు అమర్చుకోవాలంటే ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించాలి. రైతులకు పనులు జరగాలంటే ప్రైవేటు వారి చేత పనులు చేసుకోవాల్సి వస్తోంది. రైతులకు మంజూరైన విద్యుత్ సామగ్రి అందించాలన్నా, సామగ్రిని రైతులకు చేర్చాలన్నా ప్రైవేటు కార్మికుల చేత చేయించుకోవాల్సిన పరిస్థితి. రైతుల పొలాల్లో చిన్న చిన్న మరమ్మతులు చేయాలన్నా ప్రైవేటు కార్మికులే దిక్కు. రైతుల పొలాల సమీపంలో విద్యుత్ వైర్లు చేతికి అందేంత ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నా వాటిని పైకి లాగాలన్నా తగిన సిబ్బంది లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురౌతున్నాయి.

ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతే రైతులే...

వివిధ గ్రామాల్లో రైతుల ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే సంబంధిత లైన్‌మాన్ ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతులు చేయించి ట్రాన్స్‌ఫార్మర్‌ను లైన్‌మాన్ బిగించాలి. అయితే సిబ్బంది కొరత కారణంగా తమ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే రైతులు ప్రైవేటు కార్మికుల చేత ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్లి తామే తీసుకొచ్చి ప్రైవేటు వ్యక్తులతో మరమ్మతులు చేయించుకుంటుండడంతో రైతులకు అధిక భారం పడుతోంది. కనీసం ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండలానికి అవసరమైన సిబ్బందిని నియమించాలని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.

సిబ్బంది కొరత వాస్తవమే

మండలంలోని గ్రామాల్లో లైన్‌మన్‌లు, జూనియర్ లైన్‌మన్‌లు, ఎనర్జీ అసిస్టెంట్లు, లైన్ ఇన్‌స్పెక్టర్ల కొరత ఉండడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. వీటిని అధిగమించేందుకు తగిన సిబ్బందిని నియమించాలని గతంలోనే ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. ఉన్న సిబ్బందితోనే పనులు చేయిస్తున్నామని, విద్యుత్ సరఫరాలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు.

గిరిధర్, ఏఈఈ పెద్దతిప్పసముద్రం



టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లు అందజేత

కలికిరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): టీబీ రోగులకు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. స్థానిక రెడ్డి సంక్షేమ సంఘానికి చెందిన గుట్టపాలెం కృష్ణకుమారి, దొరబాబు రెడ్డి 15 మంది రోగులకు ఈ కిట్లు వితరణ చేశారు. ఒక్కో కిట్‌లో రూ.500లు విలువైన నెల రోజులకు సరిపడా పోషకాహారాలను పంపిణీ చేశారు. ఆరు నెలలపాటు ఈ కిట్లు అందజేస్తామని దాతలన్నారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్, మేడికుర్తి వైద్యాధికారి డాక్టర్ కావ్యగంధ, డీహెచ్ఈఓ మహ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షకుడు నాగిరెడ్డి, సీహెచ్ఓ భానుప్రియ, రేడియో గ్రాఫర్ రమణ, సీహెచ్‌సీ సిబ్బంది, కార్యకర్తలు, టీబీ రోగులు, దాతలు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతాన్ని పెంచండి



స్థానిక మోడల్ స్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్లో టెన్త్, ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని జిల్లా అసిస్టెంట్ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కుమార్ మోడల్ స్కూల్ సిబ్బందిని ఆదేశించారు. మోడల్ స్కూల్ తరగతి గదులను, రికార్డులను తనిఖీ చేశారు. తరగతి గదుల్లో విద్యాశక్తి ప్రోగ్రాంపై ఆరా తీశారు. ప్రిన్స్‌పాల్ శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహ ఆలయానికి వితరణ

కురబలకోట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): దిగువబోయపల్లె వద్ద నిర్మించిన ఆలయానికి వితరణ చేశారు. కంటేవారిపల్లెకు చెందిన గిరి ప్రసాద్ ఆలయానికి రూ.50వేలు విలువైన మేళతాళాలు, ఢమరుకంను నిర్వాహకులకు అందజేశారు. బీజేపీ నేతలు నరసింహారెడ్డి, బావాజి, ప్రసన్న పాల్గొన్నారు.

హోం గార్డుకు లాంఛనాలతో అంత్యక్రియలు



నివాళులర్పిస్తున్న పోలీసులు

తంబళ్లపల్లె ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కోటకొండ దిగువ తండాకు చెందిన హోం గార్డు ఈశ్వర్ నాయక్ అంత్యక్రియలను పోలీసు లాంఛనాలతో చేశారు. సబ్ కలెక్టరేట్‌లో విధులకు వెళ్తూ కురబలకోట మండలం ముదివేడు క్రాస్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హోంగార్డు ఈశ్వర్ నాయక్ దుర్మరణం చెందిన విషయం విదితమే. పోస్టు మార్టం అనంతరం మంగళవారం మృతదేహాన్ని తండాకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఈశ్వర్ నాయక్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధి నిర్వాహణకు వెళ్తూ హఠాన్మరణం చెందడం బాధాకరం అన్నారు. హోం గార్డు కుటుంబానికి అండగా నిలబడి అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పోలీస్, హోం గార్డు, ఏఆర్ అధికారులు, సిబ్బంది ఈశ్వర్ నాయక్ అంత్యక్రియలకు రూ. 25 వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం పోలీసు లాంఛనాలతో ఈశ్వర్ నాయక్‌కు అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యార్థులకు కంప్యూటర్స్ పంపిణీ



విద్యార్థులకు కంప్యూటర్లను అందిస్తున్న బ్యాంకు ఆర్ఎం శ్యాంసుందర్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐడీబీఐ బ్యాంకు సీఎస్ఆర్ (కార్పొరేషన్ సోసియల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఐదుగురికి కంప్యూటర్లను అందించినట్లు బ్యాంకు రీజనల్ ఆపరేషన్ మేనేజర్ శ్యాంసుందర్ పేర్కొన్నారు. మంగళవారం అవెన్యూ రోడ్డులోని హోప్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పేద విద్యార్థులకు కంప్యూటర్లను అందజేశారు. ఆర్ఎం శ్యాంసుందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టెక్నాలజీ పెంచడానికి తమ సంస్థ కంప్యూటర్లను అందించిందన్నారు. మేనేజరు సురేష్‌కుమార్ మాట్లాడుతూ తమ బ్యాంకు సేవా కార్యక్రమాల్లోనూ ముందు ఉంటూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అమ్మచెరువుమిట్ట మున్సిపల్ హైస్కూల్, వాల్మీకినగర్ మున్సిపల్ హైస్కూల్, చీకలబైలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెంచుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మదనపల్లెలోని హోప్ హైస్కూళ్లకు రూ. 1.75 లక్షలతో కంప్యూటర్లు అందించామన్నారు. ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎంలు శ్రీనివాసులు, అశోక్, హరినాధ్‌రెడ్డి, మోహన్‌నాయుడు, కరస్పాండెంట్ డేవిడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు 80 పల్లెవెలుగు, 17 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం అమలులో భాగంగా మదనపల్లె వన్ డిపోలో 80 పల్లె వెలుగు, 17 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కేటాయించినట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. హార్సిలీహిల్స్, తంబళ్లపల్లె మల్లయ్యకొండకు స్పెషల్ బస్సుల్లో కూడా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. డిపోలో మంగళవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈపీకే, ఓఆర్, కేఎంపీఎల్ పెంచడానికి ప్రతి ఒక్కరూ స్టేజీల వద్ద ఆపి ప్రయాణికులను బస్సు ఎక్కించాలని సూచించారు. ప్రభుత్వం జారీ చేసిన ఆధార్, రేషన్, ఓటర్ కార్డులు ఏదైనా చూపి మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ రవి, తదితరులు పాల్గొన్నారు.

అభయ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం నాయుడు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ అభయ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం నాయుడిని ఎనుకున్నారు. దేశాయ్ ఫంక్షన్ హాల్‌లో మదనపల్లె లయన్స్ క్లబ్ అభయ సభ్యుల సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఇందులో అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడిగా సాయిశేఖర్‌రెడ్డి, కార్యదర్శిగా సుధాకర్ రెడ్డి, సభ్యులుగా శ్రీనివాసులు, తెట్టు చిన్నరెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, సంతోష్ కుమార్, బీవీ రమణ, నారా రెడ్డెప్ప ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

విద్యార్థులు ధైర్యంతో ముందుకు సాగాలి

ప్రముఖ నవలా, సినీ రచయిత యండమూరి

కురబలకోట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): భయం వీడి ధైర్యంతో ముందుకు సాగితే నిజ జీవితంలోనూ విజయాలను సులభంగా సాధించవచ్చని ప్రముఖ నవలా, సినీ రచయిత యండమూరి వీరేంద్రనాధ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్సిటీలో మొదటి సంవత్సర ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానంగా మొహమాట పడడం పూర్తిగా మానుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్నిఏర్పరచుకుని దానిని చేరుకోవడానికి నిరంతరం ముందుకు సాగాలన్నారు. అందం లేని వారు ఎన్ని ఆపరేషన్‌లు చేయించుకున్నా ఐశ్వర్యరాయ్ కాలేరని, మంచి మనసు ఉంటే మదర్ థెరిస్సా సులభంగా అవవచ్చన్నారు. చదువులను ఇష్టపడి చదవాలన్నారు.

అభివృద్ధికి బాటలు వేయాలి



డీపీటీఓ రామును సన్మానిస్తున్న ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అభివృద్ధికి బాటలు వేయాలని మదనపల్లె ఆర్టీసీ 1,2 డిపోల ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి అన్నమయ్య, చిత్తూరు జిల్లాల డీపీటీఓ రామును కోరారు. మంగళవారం చిత్తూరు డీపీటీఓ కార్యాలయంలో టీడీపీ నేత గిరీష్ కుమార్, ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి డీపీటీఓను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. డిపోల అభివృద్ధికి డీపీటీఓ సలహాలు, సూచనలు ఉపయోగపడతాయన్నారు.

282 మంది అనర్హుల గుర్తింపు

పీలేరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో 282 మంది వికలాంగులను పెన్షన్‌కు అనర్హులుగా గుర్తించినట్లు ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో దివ్యాంగ పెన్షన్లపై డాక్టర్ల బృందం విచారణ జరిపిందన్నారు. ఇందులో ప్రస్తుతం 282 మందిని అనర్హులుగా గుర్తించామని చెప్పారు. సచివాలయాల వారీ అనర్హుల వివరాలిలా ఉన్నాయి. రేగళ్లు-6, బాలంవారిపల్లె-13, జేకే కాలనీ -20, తలపుల-(2) 37, కాకులారంపల్లె-12, ముడుపుల వేముల-18, వేపులబైలు-23, పీలేరు ఆర్టీసీ నల్లగుట్ట-24, పీలేరు-3 (రాఘవేంద్రనగర్)-14, పీలేరు-2 (బండ్లవంక)-19, తలపుల(1)-24, దొడ్డిపల్లె-17, గూడరేవుపల్లె-13, అగ్రహారం-13, బోడుమల్లువారిపల్లె-13, పీలేరు యర్రంరెడ్డి గుట్ట-16 ఉన్నట్లు గుర్తించారని తెలిపారు.

ట్రాఫిక్ సీఐగా గురునాథ్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ట్రాఫిక్ సీఐగా గురునాథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన సీఐ మోహన్‌కుమార్ రాయచోటికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో నూతన సీఐ గురునాథ్ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించి రోడ్డు ప్రమాదాలను నివారణకు చర్యలు చేపడతానన్నారు. కాగా ట్రాఫిక్ నిబంధనలను వాహనదారులు తప్పక పాటించాలన్నారు. ట్రాఫిక్‌తో ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా సహకరించాలని కోరారు.

స్వామిత్వ సర్వే త్వరగా చేయండి

నిమ్మనపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న స్వామిత్వ సర్వే త్వరగా చేయాలని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, సర్వేయర్లకు స్వామిత్ర సర్వేపై సమావేశం నిర్వహించారు. పంచాయతీ అధికారులు గ్రామాల్లో పర్యటించి పక్కాగా సర్వే నిర్వహించాలన్నారు. ఇప్పటికే నిమ్మనపల్లి, అగ్రహారం, తవళం సామకోటవారిపల్లి గ్రామపంచాయతీల్లో స్వామిత్వ సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన పంచాయతీల్లో సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీఓ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

నిమ్మనపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రాజంపేట టీడీపీ అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం 'పీ4'లో భాగంగా ఎన్ఆర్ఐ రాటకొండ శ్రావణి రాచవేటివారిపల్లిలో విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం బొంతవారిపల్లి, దిగువమాచిరెడ్డిగారిపల్లి, ఎగువ మాచిరెడ్డిగారి పల్లి పాఠశాలల విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, అట్టలు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 నారాయణ, నేతలు రవి పాల్గొన్నారు.

'పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి'



చెక్కులు అందజేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని 28 మంది బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.26.74లక్షలు చెక్కులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆనారోగ్యానికి గురై ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయిం చుకున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆదుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తంబళ్లపల్లెకు తమ నియోజకవర్గాలకు సమానంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తు న్నారన్నారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నేతలు మస్తాన్ రెడ్డి, చాంద్‌బాష, పాస్టర్ శ్రీనివాసులు, రమణారెడ్డి, మస్తాన్‌సాహెబ్, ఫజులు, ఎర్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముందుకొచ్చారు... శోభ తెచ్చారు

● దాతల సాయంతో పాత భవనానికి మరమ్మతులు



మరమ్మతు చేసిన భవనంలో ప్రారంభించిన విలేజ్‌క్లినిక్

బి.కొత్తకోట, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి) సేవా దృక్పథంతో కొందరు యువకులు దాతల సాయంతో సచివాలయం1 విలేజ్‌క్లినిక్‌కు శోభ తెచ్చారు. వీరు చేసిన కార్యక్రమం పలువురి ప్రశంశలు పొందింది. ఓ ఇరుకైన అద్దెగదిలో సచివాలయం1 విలేజ్‌క్లినిక్ నిర్వహించేవారు. ఇది గమనించిన చిట్టా రామక్రిష్ణారెడ్డి, కుడుంశరత్ నగరపంచాయతీ కమిషనర్ పల్లవిని కలిసి మాట్లాడారు. అనుమతి ఇస్తే బైపాస్‌రోడ్డులో నిరుప యోగంగా, అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైన పాత ఎంపీడీఓ కార్యాలయంలో ఓ భవనానికి మరమ్మతు చేసి విలేజ్‌క్లినిక్‌ను అందులోకి మారుస్తామన్నారు. కమిషనర్ అనుమతించడంతో నిధులు సేకరించి, పనులు చేపట్టి సుందరంగా తయారు చేశారు. అధికారులు విలేజ్‌క్లినిక్‌ను తరలించేందుకు సిద్ధమయ్యారు. వైద్య, సచివాలయ సిబ్బంది, దాతలు కలిసి ఆ భవనంలో క్లినిక్ ప్రారంభించారు. అద్దె లేక పోవడం, విశాలమైన భవనం అందుబాటులోకి వచ్చినట్లైంది.

భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్య



కటారి రమేశ్ మృతదేహం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు. కొత్తయిండ్లకు చెందిన కటారి రమేశ్(45) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. మంగళవారం పనికి వెళ్లి ఇంటికి వచ్చి తలుపులు వేసుకుని ఇంట్లోనే ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి తలుపులు పగలగొట్టి చూడగా అప్పటికే వేలాడుతున్నాడు. వెంటనే స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య ప్రమీల, కుమారై అనుష్క, కుమారుడు క్రాంతి ఉన్నారు. కేసు నమోదు చేశారు.

బైక్ ఢీ కొని వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొనడంతో సురేశ్ నాయక్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. నీరుగట్టువారిపల్లె వాసి సురేశ్ నాయక్ పట్టణంలోకి వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తిని బైక్‌తో ఢీకొన్నాడు. స్థానికులు తీవ్రగా గాయపడిన వ్యక్తిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. డాక్టరులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వన్‌టౌన్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.